# విశాల భారతి

తెలుగు దినపత్రిక

22-02-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 51


## పార్టీ అజెండానే ప్రజా అజెండా

- కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలకు గౌరవం, స్వేచ్ఛ ఉంది
- సొంత అజెండాలను పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేయాలి
- రాహుల్ గాంధీ కుటుంబాన్ని కనుమరుగు చేసే కుట్ర జరుగుతోంది
- కష్టపడి పనిచేసే కార్యకర్తలకు, నేతలకు తగిన గుర్తింపు ఉంటుంది
- ప్రజల్లో తిరిగితేనే నాయకులకు గౌరవం, మర్యాద దక్కుతాయి
- డీసీసీ అధ్యక్ష పదవి ఎంతో విలువైనది, బాధ్యతగా మెలగాలి




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ బలోపేతంపై వికారాబాద్ జిల్లా అనంతగిరి వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులను ప్రారంభిస్తూ, కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం మెండుగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే సంస్కృతి, స్వేచ్ఛ ఉందని, అయితే అది పార్టీ ప్రయోజనాలకే పరిమితం కావాలని ఆయన సూచించారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి తమ పార్టీలో లేదని, కానీ నాయకులు ఒకరితో ఒకరు కొట్లాడుకుంటే లక్షలాది మంది కార్యకర్తల కష్టాన్ని

మిగతా 2లో..



## మరో బాంబు పేల్చిన ట్రంప్

- దిగుమతి సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం
- గ్లోబల్ టారిఫ్‌ను 10 శాతం నుంచి ఏకంగా 15 శాతానికి పెంపు
- సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన కొద్ది గంటల్లోనే ట్రంప్ ఎదురుదాడి
- సెక్షన్ 122 అధికారాలను ప్రయోగించిన వైట్ హౌస్ బాస్
- దశాబ్దాలుగా అమెరికాను దోచుకుంటున్నారంటూ ప్రపంచ దేశాలపై ఆగ్రహం
- 150 రోజుల పాటు అమల్లో ఉండనున్న కొత్త వాణిజ్య నిబంధనలు

03

**విశాలభారతి, అంతర్జాతీయం:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ వాణిజ్య రంగంలో మరోసారి పెను సంచలనం సృష్టించారు. అమెరికాలోకి వచ్చే అన్ని దేశాల దిగుమతులపై తాత్కాలిక గ్లోబల్ టారిఫ్‌ను పది శాతం నుంచి ఏకంగా పదిహేను శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించి అంతర్జాతీయ మార్కెట్లను ఉలిక్కిపడేలా చేశారు. శుక్రవారం నాడు ఆయన విధించిన టారిఫ్‌లను కొట్టివేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పుడమి పుత్రుడి పుట్టెడు దుఃఖం..!

### రూ. 2 లక్షల రుణమాఫీపై రైతుల గంపెడు ఆశలు

### మూడు విడతలు దాటినా ఇంకా అసంపూర్ణంగానే ప్రక్రియ

- సాంకేతిక సాకులు, రేషన్ కార్డు నిబంధనలతో పెరిగిన దూరం
- అప్పుల ఊబిలో కూరుకుపోయి అన్నదాతల ఆత్మహత్యలు
- వడ్డీ భారం పెరిగి బ్యాంకుల నుంచి నోటీసుల వెల్లువ
- ప్రభుత్వ లెక్కలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు పొంతన కరువు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో 'రైతు రుణమాఫీ' అనేది కేవలం ఒక ఎన్నికల హామీ మాత్రమే కాదు, అది లక్షలాది రైతు కుటుంబాల మనుగడతో ముడిపడి ఉన్న జీవన్మరణ సమస్య. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ. 2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో అన్నదాతలు ఆ పార్టీకి బ్రహ్మరథం పట్టారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడు విడతలుగా రుణమాఫీ ప్రక్రియను చేపట్టినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తే సగం మంది రైతులకు కూడా పూర్తిస్థాయిలో లబ్ధి చేకూరలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగితాల్లో వేల కోట్లు విడుదలైనట్లు కనిపిస్తున్నా, సామాన్య రైతు చేతికి మాత్రం రుణవిముక్తి పత్రం అందడం లేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ ప్రక్రియను ప్రధానంగా మూడు విడతలుగా విభజించి అమలు చేశారు. మొదటి విడతలో రూ. లక్ష వరకు, రెండో విడతలో రూ. 1.5 లక్షల వరకు, మూడో విడతలో రూ. 2 లక్షల వరకు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ఈ మూడు విడతలు పూర్తయిన తర్వాత కూడా సుమారు 20 లక్షల మందికి పైగా రైతులు ఇంకా మాఫీ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం రూ. 17,000 కోట్ల నుంచి రూ. 18,000 కోట్ల వరకు మాత్రమే నిధులు

మిగతా 2లో..

## దేశ పరువు తీయొద్దు

### 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో రాజకీయ నిరసనల కలకలం

- రాజకీయం చేయడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ధ్వజం
- యూత్ కాంగ్రెస్ ఆందోళనలు చేయడం విడ్డూరం
- దేశ ప్రతిష్టను మసకబార్చేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోంది
- ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ ప్రతిపాదన

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో ప్రపంచ దేశాల సరసన భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టాలనే లక్ష్యంతో న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రతిష్టాత్మక 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' రాజకీయ వివాదానికి కేంద్రబిందువుగా మారింది. సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్తు ప్రగతిపై చర్చించాల్సిన ఈ అంతర్జాతీయ వేదికను కాంగ్రెస్ అనుబంధ విభాగం యూత్ కాంగ్రెస్ తన రాజకీయ ప్రదర్శనలకు వాడుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ చర్యను మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. దేశ రాజధానిలో ప్రపంచ దేశాల ప్రతినిధులు హాజరైన సదస్సులో

మిగతా 3లో..





## మక్క రైతు గుండెల్లో 'అమెరికా' బాంబు!

- రాష్ట్రంలో రికార్డు స్థాయికి చేరిన మక్కజొన్న సాగు విస్తీర్ణం
- పత్తి నుంచి భారీగా మక్క వైపు మళ్లుతున్న తెలంగాణ రైతాంగం
- ఎథనాల్, పౌల్ట్రీ రంగాల డిమాండ్‌పై అమెరికా ఒప్పందాల నీడ
- దిగుమతి సుంకాల తొలగింపుతో కుదేలవుతున్న స్థానిక మార్కెట్
- జన్యుమార్పిడి పంటల డంపింగ్‌పై నిపుణుల ఆందోళన
- మద్దతు ధర దక్కక దివాళా తీస్తున్న సామాన్య కర్షకుడు

02

## ముక్క లేనిదే ముద్ద దిగట్లేదా?



- రోజూ చికెన్ తింటే శరీరంలో అధిక ప్రోటీన్ల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం
- జీర్ణవ్యవస్థపై అదనపు భారం పడటంతో మలబద్ధకం వంటి ఇబ్బందులు తప్పవు
- చికెన్‌లోని కొవ్వు వల్ల కొలెస్ట్రాల్ పెరిగి గుండె జబ్బుల ముప్పు పొంచి ఉంది
- బ్రాయిలర్ కోళ్లలోని బాక్టీరియా వల్ల కడుపునొప్పి, ఇతర ఇన్ఫెక్షన్ల ప్రమాదం
- బరువు పెరగడం, యాసిడిటీ వంటి సమస్యలకు దారితీసే రోజూవారీ మాంసాహారం
- నాటుకోడి మాంసమే మేలని, పరిమితంగా తీసుకోవాలని నిపుణుల సూచన

03

## చొరబాటుదారులను దేశం నుంచి తరిమేస్తాం

- వచ్చే ఐదేళ్లలో దేశం నుంచి చొరబాటుదారుల పూర్తిస్థాయి బహిష్కరణ
- ఓటర్ల జాబితా నుంచే కాకుండా దేశ సరిహద్దుల దాటిస్తామన్న అమిత్ షా
- చొరబాటుదారుల ఆక్రమిత స్థలంలోనే పోలీస్ బెటాలియన్ క్యాంపస్ నిర్మాణం
- కాంగ్రెస్ పార్టీకి అక్రమ వలసదారులే ఓటు బ్యాంక్ అని కేంద్ర మంత్రి విమర్శ
- అస్సాం భవిష్యత్తును కాంగ్రెస్ విధానాలు ప్రమాదంలోకి నెట్టాయని ధ్వజం
- రాబోయే ఐదేళ్లలో ఈశాన్య భారత పారిశ్రామిక హబ్‌గా అస్సాం ఆవిర్భావం



02

## ఏఐసీసీ అంటే 'యాక్టింగ్' కమిటీ

- ఏఐసీసీ అంటే 'యాక్టింగ్ ఈజ్ కాంగ్రెస్ కల్చర్' అని బండి సంజయ్ ఎద్దేవా
- కాంగ్రెస్ శిక్షణా తరగతులు నటన నేర్పే వర్క్‌షాప్‌ల్లా ఉన్నాయని విమర్శ
- గాంధీ కుటుంబం యాజమాన్యంలో నడిచే షెల్ కంపెనీగా కాంగ్రెస్ మార్పు
- 420 హామీల అమలుపై ప్రజలను కాంగ్రెస్ నేతలు వంచిస్తున్నారని ఆరోపణ
- దేశానికి రాష్ట్రాలు ఏటీఎంల్లా కాకుండా అభివృద్ధి యంత్రాల్లా ఉండాలన్న మంత్రి
- మోదీ నాయకత్వంలోనే అసలైన నిబద్ధతతో కూడిన పాలన సాధ్యమని స్పష్టీకరణ



03

## రణరంగంగా కామారెడ్డి



- భూకబ్జా ఆరోపణలతో కామారెడ్డిలో ముదిరిన రాజకీయ సెగలు
- బీజేపీ ఎమ్మెల్యే వర్సెస్ కాంగ్రెస్ నేతల సవాళ్ల పర్వం
- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడికి యత్నం.. చెలరేగిన హింస
- కాంగ్రెస్ నేత కారుపై దాడి.. అమాంతం బోల్తా కొట్టించిన వైనం
- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హౌస్ అరెస్ట్.. భారీగా పోలీసుల మోహరింపు
- 144 సెక్షన్ తరహా ఆంక్షలతో యుద్ధ వాతావరణంలో జిల్లా కేంద్రం

03

# చొరబాటుదారులను దేశం నుంచి తరిమేస్తాం

**విశాలభారతి, జాతీయం:**



దేశ రక్షణ, అంతర్గత భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. నక్సలిజం కోరల నుంచి దేశం ఎలాగైతే విముక్తి పొందుతోందో, అదే రీతిలో అక్రమ వలసదారుల సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన భరోసా ఇచ్చారు. చొరబాటుదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే కాకుండా, వారిని దేశం నుంచే వెళ్లగొడతామని ప్రకటించారు. రాబోయే ఐదేళ్ల కాలంలో ఈ లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేస్తామని ఆయన ఉద్ఘాటించారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, చొరబాటుదారులు ఆక్రమించిన స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకోవడం ద్వారానే సమస్య ముగిసిపోదని అభిప్రాయపడ్డారు. ఒక ప్రాంతం నుంచి వారిని ఖాళీ చేయిస్తే, వారు మరో ప్రాంతంలో స్థిరపడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే అక్రమ వలసదారులను దేశ సరిహద్దుల వెలుపలికి పంపడమే ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు. విశేషమేమిటంటే, గతంలో చొరబాటుదారులు అక్రమంగా ఆక్రమించుకున్న స్థలంలోనే ఇప్పుడు పోలీస్ బెటాలియన్ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇది ఆక్రమణదారులకు ఒక బలమైన హెచ్చరిక అని, ప్రభుత్వ భూములను కాపాడటంలో తమ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ వైఖరిపై అమిత్ షా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని రాహుల్ గాంధీ మాటలు చెప్పారని, కానీ ఆచరణలో హస్తం పార్టీ ఆ పని ఎప్పటికీ చేయదని ఎద్దేవా చేశారు. ఎందుకంటే ఆ చొరబాటుదారులే కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ఓటు బ్యాంకుగా మారారని ఆయన ఆరోపించారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే కాంగ్రెస్‌కు ముఖ్యమని విమర్శించారు. ఒకవేళ అక్రమ వలసదారుల తొలగింపునకు కాంగ్రెస్ నిజంగానే కట్టుబడి ఉంటే, ఆ విషయాన్ని ధైర్యంగా తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు పొందుపరచడం లేదని ఆయన సవాల్ విసిరారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న బుజ్జగింపు రాజకీయాలు అస్సాం అస్థిత్వానికి, భద్రతకు పెద్ద ముప్పుగా పరిణమించాయని హెచ్చరించారు.

అస్సాం అభివృద్ధిపై కేంద్ర మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఐదేళ్లలో అస్సాం రాష్ట్రం ఈశాన్య భారత దేశానికే పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందని, యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని చెప్పారు. శాంతి భద్రతలు మెరుగుపడటం వల్లే పెట్టుబడులు తరలివస్తున్నాయని, అస్సాం ప్రజల కలలు త్వరలోనే సాకారం అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, గత పదేళ్లలో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయని ఆయన గుర్తు చేశారు.

పోలీస్ బెటాలియన్ క్యాంపస్ శంకుస్థాపన అనంతరం, అమిత్ షా గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవాన్ల శౌర్యపరాక్రమాలను ఆయన కొనియాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. దేశభక్తి, అంకితభావంలో సీఆర్పీఎఫ్ దళం అందరికీ ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంసించారు. దేశంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పడంలో ఈ దళం పాత్ర అనన్యం అని కొనియాడారు. జవాన్ల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, అత్యాధునిక ఆయుధాలు , సాంకేతికతను అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సరిహద్దుల భద్రతతో పాటు అంతర్గత సమస్యలను ఎదుర్కోవడంలో మన దళాలు సిద్ధంగా ఉన్నాయని భరోసా ఇచ్చారు. నేటి తరం రాజకీయాల్లో యువత పాత్ర పెరగాలని, దేశ భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని అమిత్ షా పిలుపునిచ్చారు. చొరబాటుదారులు దేశ వనరులను దోచుకోవడమే కాకుండా, స్థానిక సంస్కృతిని కూడా దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అస్సాం ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ బాధ్యత అని, అక్రమ వలసల వల్ల స్థానికులకు కలిగే నష్టాన్ని తాము అడ్డుకుంటామని చెప్పారు. డిజిటల్ పద్ధతిలో ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడం ద్వారా దొంగ ఓట్లకు చెక్ పెడతామని వివరించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ఆ దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

అస్సాంలో గతంలో ఉన్న అశాంతి, ఉగ్రవాద కార్యకలాపాలు ఇప్పుడు గణనీయంగా తగ్గాయని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. వేలాది మంది తిరుగుబాటుదారులు ఆయుధాలు వదిలి ప్రధాన స్రవంతిలో చేరడం తమ ప్రభుత్వ విజయమని పేర్కొన్నారు. శాంతి నెలకొన్న చోట మాత్రమే అభివృద్ధి సాధ్యమని, అందుకే ఈశాన్య రాష్ట్రాల్లో సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం పరిధిని కూడా తగ్గిస్తూ వస్తున్నామని చెప్పారు. చొరబాటుదారుల సమస్యను కూడా అదే స్ఫూర్తితో పరిష్కరిస్తామని, ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. అక్రమ వలసదారుల పట్ల ఉదాసీనత వహించే కాలం చెల్లిపోయిందని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో సరిహద్దులు అస్తవ్యస్తంగా ఉండేవని, ఇప్పుడు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని అమిత్ షా వివరించారు. స్మార్ట్ ఫెన్సింగ్ మరియు లేజర్ టెక్నాలజీ ద్వారా చొరబాటును కట్టడి చేస్తున్నామని చెప్పారు. అస్సాం ప్రభుత్వం కూడా కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ చొరబాటుదారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. అస్సాం మట్టిపై అస్సాం ప్రజలకే మొదటి హక్కు ఉంటుందని, పరాయి వ్యక్తులు ఇక్కడ తిష్టవేయడాన్ని తాము అంగీకరించబోమని తెగేసి చెప్పారు. ఈ పోరాటంలో ప్రజల మద్దతు తమకు ఎల్లవేళలా ఉండాలని ఆయన కోరారు.

## పిస్తా హౌస్ ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ, విశాలభారతి:** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ త్వరలోనే అద్భుతమైన 'సూపర్ స్మార్ట్ సిటీ'గా రూపుదిద్దుకోబోతోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రముఖ ఆహార సంస్థ 'పిస్తా హౌస్' బ్రాంచ్‌ను మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పిస్తా హౌస్ వంటి బ్రాండ్లు నల్లగొండకు రావడం ఇక్కడి వ్యాపార, వాణిజ్య వృద్ధికి నిదర్శనమని, ఇది పట్టణ అభివృద్ధిలో ఒక శుభపరిణామమని నిర్వాహకులను అభినందించారు. నల్లగొండను కేవలం స్మార్ట్ సిటీగానే కాకుండా, పచ్చదనంతో విరాజిల్లే 'గ్రీన్ సిటీ'గా, పరిశుభ్రమైన 'చెత్త రహిత' నగరంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం ఇప్పటికే కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, రానున్న రెండేళ్ల కాలంలోనే హైదరాబాద్‌కు దీటుగా నల్లగొండ ముఖచిత్రాన్ని మారుస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోనే ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు ఆదర్శంగా తీసుకునేలా నల్లగొండను ఒక మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తామని, ప్రజలకు అత్యాధునిక వసతులు కల్పించడంలో రాజీపడబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఇటికాల మంగమ్మ శ్రీనివాస్ మరియు పిస్తా హౌస్ నిర్వాహకులు కొణతం నాగిరెడ్డి, వినయ్ రెడ్డి, మిథున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పార్టీ అజెండానే ప్రజా అజెండా

**మొదటిపేజీ తరువాయి**




వృధా చేసినట్లు అవుతుందని హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలపై గణాంకాలతో వివరిస్తూ, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ , కాంగ్రెస్ మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతమే అని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయితే, ప్రభుత్వం ఏర్పడిన ఆర్నెళ్ల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ మెజార్టీ 4 శాతానికి పెరిగిందని, ఆపై జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో అది ఏకంగా 12 శాతానికి చేరిందని వెల్లడించారు. ఇది కేవలం కార్యకర్తల కృషి, ప్రజలకు ప్రభుత్వంపై ఉన్న నమ్మకం వల్లే సాధ్యమైందని ఆయన విశ్లేషించారు. పార్టీ ఓటు బ్యాంకు 2.5 శాతం నుంచి 40 శాతానికి పెరగడం వెనుక అందరి సామూహిక ప్రయత్నం ఉందని కొనియాడారు. గాంధీ కుటుంబం దేశం కోసం చేసిన త్యాగాలను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. మోతీలాల్ నెహ్రూ వేల కోట్ల ఆస్తులను దేశం కోసం త్యాగం చేశారని, నెహ్రూ ఎన్నో ఏళ్లు జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు ప్రాణాలను పణంగా పెట్టి దేశ సమగ్రతను కాపాడారని తెలిపారు. అటువంటి గొప్ప కుటుంబంపై, ముఖ్యంగా రాహుల్ గాంధీపై ఇవాళ నిందలు వేస్తున్నారని ఆయన మండిపడ్డారు. దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీని, రాహుల్ గాంధీని రాజకీయంగా కనుమరుగు చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని పిలుపునిచ్చారు.

నాయకులు పైరవీల కోసం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారం కోసం తిరగాలని రేవంత్ రెడ్డి సూచించారు. పైరవీల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగితే ప్రజల్లోనూ, పార్టీలోనూ చులకన అవుతారని హెచ్చరించారు. వాటిని వదిలేసి ప్రజల తరఫున క్షేత్రస్థాయిలో పోరాడితే గౌరవం, మర్యాద కచ్చితంగా పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. నాయకులు తమ సొంత అజెండాలను పక్కన పెట్టి, ప్రజా అజెండానే పార్టీ అజెండాగా భావించి ముందుకు సాగాలని కోరారు. సమస్యలపై నిజాయితీగా కొట్లాడితే స్వపక్షంతో పాటు విపక్షం కూడా గౌరవించే స్థాయికి నాయకులు ఎదుగుతారని ఆయన హితబోధ చేశారు.

తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో పార్టీ పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉండేదని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. అప్పట్లో పార్టీ లోపల కూడా కొందరి నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నానని, కానీ వెనకడుగు వేయకుండా నేతలందరినీ కలిసి తన ఆలోచనలను వివరించి ఒప్పించానని చెప్పారు. అందరం కలిసికట్టుగా పనిచేయడం వల్లే రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోగలిగామని వివరించారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసే వారికి మెరిట్ ప్రాతిపదికన కచ్చితంగా న్యాయం జరుగుతుందని, పదవుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. డీసీసీ అధ్యక్ష పదవి అనేది అత్యంత కీలకమైనదని, దీనిని కేవలం ఒక పదవిగా కాకుండా ఒక గొప్ప అవకాశంగా భావించాలని రేవంత్ రెడ్డి కోరారు. గతంలో డీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యేగా అవకాశం రాని వారికి ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్ పదవులతో గౌరవించామని గుర్తు చేశారు. సుమారు 60 మందికి పైగా కార్యకర్తలు, నేతలకు కార్పొరేషన్ పదవులు కట్టబెట్టామని తెలిపారు. పార్టీలో అందరి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, కష్టపడే తత్వం ఉన్నవారికి ఎదుగుదల ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన పాదయాత్రను ఒక ఆదర్శంగా తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర రెడ్డి గారు పాదయాత్ర చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని గుర్తు చేశారు. నాయకులు ప్రజల మధ్య ఉన్నప్పుడే వారి సమస్యలు తెలుస్తాయని, ఆ దిశగా డీసీసీ అధ్యక్షులు తమ జిల్లాల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. వచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోకుండా, డీసీసీ స్థాయి నుంచి పీసీసీ, ఎమ్మెల్యే, ఎంపీ, చివరికి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

మొత్తం ప్రక్రియలో పార్టీ నిరంతరం పునరుజ్జీవనం చెందుతూ ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. శిక్షణ తరగతుల ముఖ్య ఉద్దేశం నాయకులకు కేవలం రాజకీయాలు నేర్పడమే కాకుండా, ప్రజల పట్ల జవాబుదారీతనాన్ని పెంచడమని వివరించారు. ఏఐసీసీ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల జిల్లా అధ్యక్షులకు ఈ తరగతులు నిర్వహించడం శుభపరిణామమని, ఇది భవిష్యత్తులో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మార్చి 2 వరకు జరగనున్న ఈ శిక్షణలో ఖర్గే, కేసీ వేణుగోపాల్ వంటి అగ్రనేతలు పాల్గొనడం వల్ల కార్యకర్తల్లో ఉత్సాహం పెరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత జిల్లా నాయకత్వానిదేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని, అదే సమయంలో విపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని కోరారు. పార్టీ అంటే కేవలం ఎన్నికల సమయంలో వచ్చే యంత్రాంగం కాదని, ప్రజల కష్టసుఖాల్లో తోడుండే ఒక కుటుంబం అని ప్రజలు భావించేలా చేయాలన్నారు. క్రమశిక్షణతో కూడిన రాజకీయాలే నాయకుడిని ఉన్నత స్థానంలో నిలబెడతాయని ఆయన తన ప్రసంగంలో నొక్కి చెప్పారు.

# మక్క రైతు గుండెల్లో 'అమెరికా' బాంబు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ వ్యవసాయ రంగంలో ప్రస్తుతం ఒక విలక్షణమైన మార్పు కనిపిస్తోంది. పత్తి సాగులో వస్తున్న ఒడిదుడుకులు, పెట్టుబడి భారంతో విసిగిపోయిన రైతన్నలు ప్రత్యామ్నాయంగా మక్కజొన్న (మక్క) సాగు వైపు భారీగా మొగ్గు చూపుతున్నారు. గత మూడు సంవత్సరాల గణాంకాలను పరిశీలిస్తే, మక్క పంట విస్తీర్ణం దాదాపు రెండింతలు పెరగడం విశేషం. ముఖ్యంగా 202526 రబీ సీజన్‌లో మక్క సాగు ఏకంగా 11.21 లక్షల ఎకరాలకు చేరింది. గత సీజన్‌తో పోలిస్తే ఇది 174 శాతం పెరుగుదల కావడం గమనార్హం. కోళ్ల పెంపకం (పౌల్ట్రీ), ఎథనాల్ పరిశ్రమల నుంచి వస్తున్న డిమాండ్‌ను చూసి రైతులు ఆశగా ఈ పంటను వేస్తున్నప్పటికీ, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు వారి ఆశలపై నీళ్లు చల్లేలా ఉన్నాయి. రాష్ట్రంలో పత్తి సాగు క్రమంగా తగ్గుముఖం పట్టడం మక్క విస్తీర్ణం పెరగడానికి ప్రధాన కారణమైంది. 2023 ఖరీఫ్‌లో 50 లక్షల ఎకరాల్లో ఉన్న పత్తి సాగు, 2024 నాటికి 43 లక్షల ఎకరాలకు పడిపోయింది. పత్తి విత్తనాల ధరలు, కూలీల కొరత, వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాల కంటే మక్క సాగు సులభమని రైతులు భావిస్తున్నారు. కేవలం 90 రోజుల్లో కోతకు రావడం, విత్తన ఖర్చు ఎకరానికి కేవలం రూ. 600 లోపే ఉండటం అన్నదాతను ఆకర్షిస్తోంది. వర్షానికి తడిసినా ఎథనాల్ ప్లాంట్లు కొనుగోలు చేస్తాయన్న ధీమాతో రైతులు సాగును విస్తరిస్తున్నారు. అయితే, ఈ ఉత్సాహంపై అమెరికాభారత్ వాణిజ్య ఒప్పందాలు గొడ్డలిపెట్టులా మారే ప్రమాదం కనిపిస్తోంది.

అమెరికాతో కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాల వల్ల స్థానిక రైతులకు ఒరిగేదేమీ లేదని, పైగా నష్టాలే ఎక్కువని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత ఎగుమతులపై సుంకాలు అధికంగా ఉండగా, అమెరికా నుంచి వచ్చే ఉత్పత్తులపై సుంకాలు తగ్గించడం వల్ల మన మార్కెట్ దెబ్బతింటోంది. గతంలో పత్తిపై సుంకం తొలగించడంతో ధరలు భారీగా పడిపోయిన విషయాన్ని రైతు సంఘాల నేతలు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు మక్క విషయంలోనూ ఇదే జరిగితే, కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక రైతు నష్టపోయే అవకాశం ఉంది. అమెరికా తన రైతులకు ఇచ్చే భారీ సబ్సిడీల వల్ల వారి ఉత్పత్తులు చౌకగా మన దేశంలోకి వస్తున్నాయి. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న మక్క ప్రధానంగా జన్యుమార్పిడి రకానికి చెందినది. డీడీజీఎస్ రూపంలో వచ్చే ఈ మక్క చవకగా లభిస్తుండటంతో, స్థానిక పౌల్ట్రీ మరియు ఎథనాల్ పరిశ్రమలు దానిపైనే ఆసక్తి చూపుతున్నాయి. యూరప్ వంటి దేశాలు ఈ జీఎం ఆహారాన్ని అనుమతించకపోవడంతో, అమెరికా ఇప్పుడు భారత్‌ను ఒక ప్రధాన మార్కెట్‌గా మార్చుకుంటోంది. దీనివల్ల మన దేశంలో పండే సహజ సిద్ధమైన మక్కకు డిమాండ్ తగ్గిపోతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో మక్క ధర క్వింటాలుకు రూ. 1,200 నుంచి రూ. 1,600 మధ్య ఊగిసలాడుతోంది, కానీ ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ. 2,400 ఉండటం గమనార్హం.

మక్క సాగులో ఎదురవుతున్న ఈ సంక్షోభంపై కిసాన్ సభ నాయకులు ఘాటుగా స్పందిస్తున్నారు. విత్తనాల కొనుగోలు నుంచి మార్కెటింగ్ వరకు ప్రభుత్వం రైతును గాలికి వదిలేసిందని వారు ఆరోపిస్తున్నారు. వేరుశెనగ వంటి పంటలకు విత్తన ధరలు అధికంగా ఉండటంతో రైతులు అనివార్యంగా మక్క వైపు మళ్లుతున్నారు. ప్రభుత్వం వద్ద స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల రైతులు మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతుకు, తీరా పంట చేతికొచ్చే సమయానికి విదేశీ దిగుమతుల కారణంగా ధరలు పడిపోవడం మరణశాసనంగా మారుతోంది. ఇది కేవలం ఆర్థిక నష్టమే కాదు, రైతాంగ ఆత్మగౌరవంపై జరుగుతున్న దాడి. నిపుణుల విశ్లేషణ ప్రకారం, అమెరికా ప్రతి డాలర్ ఎగుమతికి 1.5 డాలర్ల సబ్సిడీ ఇస్తోంది. మన దేశంలో 'రైతు భరోసా' వంటి పథకాలు ఉత్పత్తి ఖర్చులో కనీసం 5 శాతం కూడా భర్తీ చేయడం లేదు. ఈ అసమాన పోటీలో భారత రైతు నిలదొక్కుకోవడం అసాధ్యం. అగ్రరాజ్యం తన దేశంలో మిగిలిపోయిన స్టాక్‌ను భారత్‌లోకి డంపింగ్ చేస్తే, ఇక్కడి మార్కెట్ పూర్తిగా కుప్పకూలుతుంది. ఇప్పటికే కర్ణాటక వంటి రాష్ట్రాల్లో పాప్‌కార్న్ రకం మక్క పండించే రైతులు కొనుగోలుదారులు లేక అల్లాడుతున్నారు. గతంలో రూ. 80 పలికిన ధర ఇప్పుడు రూ. 30కి పడిపోవడం విదేశీ దిగుమతుల ప్రభావానికి నిదర్శనం.

ఎథనాల్ పరిశ్రమల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. ప్రభుత్వం సబ్సిడీ ధరకే వరిని ఈ ప్లాంట్లకు సరఫరా చేస్తోంది. ఎఫ్‌సీఐకి ఒక కిలో వరి నిల్వ చేయడానికి రూ. 40 ఖర్చవుతుంటే, ప్లాంట్ యజమానులకు మాత్రం రూ. 22.50 కే అందుతోంది. ఇలాంటి ప్రోత్సాహకాలు కేవలం పరిశ్రమలకే పరిమితమవుతున్నాయి తప్ప, పండించే రైతుకు అందడం లేదు. ప్లాంట్ యజమానులు నష్టమొస్తే పరిశ్రమ మూసేస్తారు, కానీ భూమినే నమ్ముకున్న రైతు దివాళా తీసి ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. విధాన నిర్ణయాలు తీసుకునేటప్పుడు కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కంటే సాగుదారుల క్షేమమే ముఖ్యమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

విదేశీ వాణిజ్య అభివృద్ధి మరియు నియంత్రణ చట్టం ప్రకారం ఆహార ధాన్యాల దిగుమతులు కేవలం ఎఫ్‌సీఐ ద్వారానే జరగాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నోటిఫికేషన్ల ద్వారా ప్రైవేట్ సంస్థలకు అనుమతులు ఇస్తూ మార్కెట్‌ను వక్రీకరిస్తోంది. డీజీఎఫ్‌టీ ఇచ్చే సడలింపులతో సుంకం లేకుండా మక్క దిగుమతి అవుతోంది. ఇలా వచ్చిన సరుకును నిబంధనలకు విరుద్ధంగా ముడి రూపంలోనే బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుండటంతో స్థానిక రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కొందరు దిగుమతిదారుల స్వార్థం కోసం దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతుల నోటికాడ కూడును దూరం చేయడం అన్యాయమనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం తెలంగాణలో పండుతున్న మక్క రాష్ట్ర అవసరాలకు సరిపోతుందని సాగు విస్తీర్ణాన్ని చూస్తే అర్థమవుతోంది. సరైన గిట్టుబాటు ధర కల్పిస్తే రైతులు మరింత ఉత్సాహంగా సాగు చేసి ఎగుమతులు కూడా చేయగలరు. కానీ ప్రభుత్వం దిగుమతులకు రెడ్ కార్పెట్ వేయడం వల్ల దేశీయ ఉత్పత్తికి విలువే లేకుండా పోతోంది. పత్తికి సరైన ధర లేక, మక్కకు మార్కెట్ లేక రైతు రెంటికీ చెడ్డ రేవడిలా మారుతున్నాడు. అంతర్జాతీయ ఒప్పందాల విషయంలో దేశీయ రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడం ఏమాత్రం సమంజసం కాదు. విదేశీ విధానాల ప్రభావం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోంది.

# పుడమి పుత్రుడి పుట్టెడు దుఃఖం..!

**మొదటిపేజీ తరువాయి**



రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని, మరో రూ. 13,000 కోట్లకు పైగా నిధులు విడుదల కావాల్సి ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో 'నాలుగో విడత' లేదా 'మిగిలిపోయిన వారి విడత' ఎప్పుడు వస్తుందా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రుణమాఫీ అమలులో ప్రభుత్వం విధించిన కఠిన నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయి. ముఖ్యంగా కుటుంబ నిర్ధారణ కోసం రేషన్ కార్డును తప్పనిసరి చేయడం వల్ల లక్షలాది మంది అర్హులు జాబితా నుంచి కనుమరుగయ్యారు. ఉమ్మడి కుటుంబాల్లో ఉన్న రైతులు, రేషన్ కార్డులు లేని కొత్త దంపతులు, తండ్రి పేరిట భూమి ఉండి కొడుకు పేరిట రుణం ఉన్న సందర్భాల్లో ఈ నిబంధన అడ్డంకిగా మారింది. దీనికి తోడు ఆధార్ కార్డులో పేర్ల తప్పులు, బ్యాంకు ఖాతా నంబర్ల తప్పులు, కేవైసీ సమస్యలు వంటి సాంకేతిక కారణాలతో వేలాది మంది రైతుల పేర్లు పెండింగ్‌లో పడిపోయాయి. అధికారుల చుట్టూ తిరిగినా 'పైన ఇంకా ఓకే కాలేదు' అనే సమాధానమే రైతులకు ఎదురవుతోంది.

రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య వడ్డీ భారం. ప్రభుత్వం హామీ ఇచ్చిన సమయం నుంచి ఇప్పటివరకు బ్యాంకులు వడ్డీని లెక్కిస్తూనే ఉన్నాయి. అసలు మాఫీ అయినా వడ్డీ మాఫీ కాదని బ్యాంకులు స్పష్టం చేస్తుండటంతో, రైతులకు కొత్త రుణాలు పుట్టడం లేదు. పాత అప్పు తీరక, కొత్త పెట్టుబడికి డబ్బుల్లేక రైతులు మళ్లీ వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. బ్యాంకులు రికవరీ నోటీసులు పంపడం, అధికారులు గ్రామాల్లోకి వచ్చి ఒత్తిడి చేయడం వంటి చర్యలతో రైతులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు. గౌరవంగా బతకాలనుకునే అన్నదాతకు ఈ నోటీసులు అవమానకరంగా మారుతున్నాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన గడిచిన పది నెలల కాలంలో రైతు ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. రుణమాఫీ కాలేదన్న బెంగతో, అప్పుల బాధ తాళలేక తెలంగాణవ్యాప్తంగా వందలాది మంది రైతులు తనువు చాలించినట్లు అనధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వివిధ రైతు సంఘాల నివేదికల ప్రకారం, కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు 400 మందికి పైగా రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ముఖ్యంగా పత్తి, మిర్చి పండించే రైతులు సాగు పెట్టుబడి పెరిగి, దిగుబడి రాక, ఆపై ప్రభుత్వం ఇస్తానన్న రుణమాఫీ అందక తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. ప్రతి ఆత్మహత్య వెనుక ఒక కుటుంబం వీధిన పడుతున్నా, ప్రభుత్వం మాత్రం వీటిని ఇతర కారణాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం దురదృష్టకరం. రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు పంటను దెబ్బ తీస్తుంటే, మరోవైపు ప్రభుత్వ విధానాలు అన్నదాతను కుంగదీస్తున్నాయి. రుణమాఫీ అవుతుందన్న నమ్మకంతో గతేడాది అప్పులు కట్టని రైతులకు ఇప్పుడు వడ్డీ పెరిగి తడిసి మోపెడైంది. ఇప్పుడు ప్రభుత్వం కేవలం అసలు మొత్తాన్ని మాత్రమే జమ చేస్తుండటంతో, మిగిలిన వేల రూపాయల వడ్డీని చెల్లించలేక రైతులు సతమతమవుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, మద్దతు ధర అందకపోవడం వంటి సమస్యలు తోడై రైతు వెన్ను విరుస్తున్నాయి. ఎరువులు, విత్తనాల ధరలు ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో రుణమాఫీ ఒక్కటే రైతుకు ఊరటనిచ్చే అంశం, కానీ అది కూడా అందని ద్రాక్షలా మారింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం సుమారు 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ వర్తిస్తుందని అంచనా వేయగా, ఇప్పటివరకు కేవలం 22 లక్షల మందికి మాత్రమే లబ్ధి చేకూరినట్లు తెలుస్తోంది. అంటే దాదాపు 45 శాతం మంది రైతులు ఇంకా నిరీక్షణలోనే ఉన్నారు. ప్రభుత్వం చెబుతున్న 'మూడు విడతలు' ముగిసినా, క్షేత్రస్థాయిలో రైతులు తమ ఖాతాల్లో సున్నా నిల్వ చూడలేకపోతున్నారు. తదుపరి విడత ఎప్పుడు ఉంటుందో స్పష్టత లేకపోవడం వల్ల గ్రామాల్లో గందరగోళం నెలకొంది. వ్యవసాయ శాఖ అధికారులు సర్వేలు చేస్తున్నామని చెబుతున్నా, అవి ఎప్పుడు పూర్తవుతాయో, నిధులు ఎప్పుడు విడుదలవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన 'ఇందిరమ్మ రాజ్యం'లో రైతులకు భరోసా కరువైందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. రుణమాఫీ ఆలస్యం కావడం వల్ల కలిగే వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం 2 లక్షల లోపు ఉన్నవారికే కాకుండా, ఆ పైన ఉన్నవారికి కూడా వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. పాత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కాలక్షేపం చేయకుండా, తక్షణమే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని మేధావులు సూచిస్తున్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు, రుణవిముక్తి కల్పించినప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిలబడుతుంది.

తెలంగాణ అన్నదాత ఇప్పుడు రెండు పడవల ప్రయాణం చేస్తున్నాడు. ఒకవైపు ప్రభుత్వంపై నమ్మకం, మరోవైపు అప్పుల భయం. ఈ రెండింటి మధ్య నలిగిపోతున్న రైతును ఆదుకోవడానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. సాంకేతిక కారణాలను సాకులుగా చూపకుండా, మానవీయ కోణంలో రైతుల సమస్యలను పరిశీలించాలి. ప్రతి విలేజ్ ఆఫీసులో రుణమాఫీకి సంబంధించిన ఫిర్యాదుల కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రైతులకు భరోసా ఇవ్వాలి. లేనిపక్షంలో సాగు విముక్తి లేని తెలంగాణలో రైతు ఆత్మహత్యలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరికలు వస్తున్నాయి. రుణమాఫీ అనేది కేవలం అంకెలకు సంబంధించిన వ్యవహారం కాదు, అది రాష్ట్ర ఉత్పాదక శక్తికి సంబంధించిన అంశం. ముఖ్యమంత్రి , మంత్రులు ప్రకటనలకే పరిమితం కాకుండా, నిధుల విడుదలలో వేగం పెంచాలి. వచ్చే వ్యవసాయ సీజన్ నాటికైనా ప్రతి రైతుకూ రుణమాఫీ పత్రం అందేలా చూడాలి. అప్పుడే తెలంగాణ మట్టి మనిషి ముఖంలో చిరునవ్వు కనిపిస్తుంది. రాష్ట్ర సర్కారు ఇప్పటికైనా స్పందించి మిగిలిపోయిన అర్హులందరికీ తక్షణమే నాలుగో విడత కింద నిధులు విడుదల చేసి, ఆత్మహత్యలు లేని తెలంగాణను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రణరంగంగా కామారెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



కామారెడ్డి జిల్లా కేంద్రం శనివారం ఒక్కసారిగా రాజకీయ రణరంగాన్ని తలపించింది. గత కొద్దిరోజులుగా సాగుతున్న భూకబ్జా ఆరోపణలు, ప్రత్యారోపణలు చివరకు భౌతిక దాడులకు దారితీయడంతో పట్టణంలో యుద్ధ వాతావరణం నెలకొంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నాయకులు విసురుకున్న బహిరంగ చర్చ సవాళ్లు కాస్తా వీధి పోరాటాలుగా మారాయి. రాజకీయ వైరి వర్గాల మధ్య నెలకొన్న ఈ ఉద్రిక్తత సామాన్య ప్రజానీకాన్ని భీతావహానికి గురిచేసింది. శాంతిభద్రతలు అదుపు తప్పకుండా చూసేందుకు పోలీసులు రంగంలోకి దిగినా, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇరు పార్టీల కార్యకర్తలు పరస్పరం దాడులకు దిగడంతో కామారెడ్డి గడగడలాడింది. ఈ వివాదానికి ప్రధాన కేంద్ర బిందువు అరోరా భూముల వ్యవహారం. బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఈ భూములను కబ్జా చేశారని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ చేసిన ఆరోపణలు రాజకీయ దుమారాన్ని రేపాయి. తనపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ శ్రేణులకు సవాల్ విసిరారు. తన క్యాంప్ కార్యాలయమే వేదికగా చర్చకు సిద్ధమని ఆయన ప్రకటించడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ సవాల్‌ను స్వీకరించిన కాంగ్రెస్ నేత, మాజీ సర్పంచ్ గిరి రెడ్డి మహేందర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే కార్యాలయం వైపు బయలుదేరడంతో ఉద్రిక్తతలకు బీజం పడింది.

కాంగ్రెస్ శ్రేణులు భారీ కాన్వాయ్‌తో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీపానికి చేరుకోవడంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా అదుపు తప్పింది. అప్పటికే అక్కడ భారీ సంఖ్యలో వేచి ఉన్న బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ నేతలను అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య మొదట మాటల యుద్ధం మొదలై, ఆపై తోపులాటగా మారింది. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకుంటూ ఉద్రిక్తంగా మారారు. పోలీసుల సమక్షంలోనే కార్యకర్తలు రెచ్చిపోవడంతో పరిస్థితి గందరగోళంగా తయారైంది. ఎమ్మెల్యే 'డౌన్ డౌన్' అంటూ కాంగ్రెస్ నాయకులు చేసిన నినాదాలు బీజేపీ కార్యకర్తల్లో ఆగ్రహాన్ని కట్టలు తెంచుకునేలా చేశాయి.

ఈ క్రమంలోనే కామారెడ్డి వీధుల్లో హింస చెలరేగింది. ఆగ్రహంతో ఊగిపోయిన బీజేపీ కార్యకర్తలు మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి ప్రయాణిస్తున్న కారును లక్ష్యంగా చేసుకున్నారు. పెద్ద ఎత్తున గుమిగూడిన కార్యకర్తలు కారుపై రాళ్లు, కర్రలతో దాడికి దిగారు. కారు అద్దాలను ధ్వంసం చేయడమే కాకుండా, ఉన్మాదంతో కారును అమాంతం గాలిలోకి ఎత్తి బోల్తా పడేయడం కలకలం రేపింది. కారు ఉల్టా పల్టా కావడంతో లోపల ఉన్నవారు ప్రాణభయంతో కేకలు వేశారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రాష్ట్రవ్యాప్తంగా కామారెడ్డి ఘటన చర్చనీయాంశమైంది. రాజకీయ కక్షలు ఇంతటి స్థాయికి చేరుతాయని ఎవరూ ఊహించలేదు.

పరిస్థితి విషమిస్తుండటంతో పోలీసులు కఠిన చర్యలు చేపట్టక తప్పలేదు. చర్చకు వెళ్లకుండా ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డిని ఆయన నివాసంలోనే హౌస్ అరెస్ట్ చేశారు. వందలాది మంది పోలీసు బలగాలను ఆయన ఇంటి చుట్టూ మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికార పక్షం కబ్జాలను ప్రశ్నిస్తున్నందునే తనను గృహనిర్బంధం చేశారని, పోలీసు యంత్రాంగం ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిందని ఆయన మండిపడ్డారు. పట్టణంలోని ఇతర ముఖ్య నేతలను కూడా పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించారు. చర్చా వేదికగా ప్రకటించిన శిశు మందిర్ పాఠశాల పరిసర ప్రాంతాలను పోలీసులు తమ పూర్తి ఆధీనంలోకి తీసుకున్నారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి, అపరిచిత వ్యక్తులు అటువైపు వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. వందలాది మంది పోలీసుల మోహరింపుతో ఆ ప్రాంతం మొత్తం కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించింది. మీడియా ప్రతినిధులను కూడా లోపలికి అనుమతించకుండా ఆంక్షలు విధించారు. చర్చా వేదిక నుంచి కాంగ్రెస్ శ్రేణులు ఊరేగింపుగా వెళ్లడానికి ప్రయత్నించిన ప్రతిసారీ పోలీసులు అడ్డుకోవడంతో తోపులాటలు జరిగాయి. ఈ గొడవల్లో పలువురు కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి.

కామారెడ్డిలో రాజకీయ వైరం ఈ స్థాయిలో పెరగడం వెనుక లోతైన కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఎన్నికల నుంచి ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. భూముల వ్యవహారం ఇప్పుడు దానికి ఆజ్యం పోసింది. భూకబ్జా ఆరోపణలను నిజమని నిరూపిస్తామని కాంగ్రెస్, తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని బీజేపీ నేతలు పరస్పరం హెచ్చరించుకుంటున్నారు. ఈ క్రమంలోనే కార్యకర్తలు భావోద్వేగాలకు లోనై దాడులకు దిగడం పట్టణ ప్రశాంతతను దెబ్బతీసింది. రాజకీయ నేతల సవాళ్లు చివరకు ఆస్తి నష్టానికి, ప్రజా ఆందోళనకు దారితీశాయి.

దాడి జరిగిన తర్వాత పోలీసులు మహేందర్ రెడ్డిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. కారు బోల్తా పడిన ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. గొడవకు కారణమైన వ్యక్తులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అదనపు బలగాలను రప్పించి పాత బస్టాండ్, నిజాంసాగర్ రోడ్డు వంటి కీలక ప్రాంతాల్లో పహారా పెంచారు. అయినప్పటికీ, లోలోపల సెగలు ఇంకా చల్లారలేదు. రెండు పార్టీల కార్యకర్తలు ఇంకా రహస్య ప్రదేశాల్లో సమావేశమవుతుండటంతో పోలీసులు నిఘా పెంచారు.

ప్రస్తుతం కామారెడ్డి జిల్లా కేంద్రంలో 144 సెక్షన్ తరహా ఆంక్షలు అమలులో ఉన్నాయి. ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడకూడదని ఆంక్షలు విధించారు. బహిరంగ చర్చ పేరుతో మొదలైన రాజకీయ రచ్చ భౌతిక దాడుల వరకు వెళ్లడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన వేదికలు హింసాత్మక కేంద్రాలుగా మారడంపై మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో సవాళ్లు సహజమే అయినా, అవి చట్ట పరిధిలోనే ఉండాలని, హింసకు తావుండకూడదని వారు హితవు పలుకుతున్నారు. కారు బోల్తా ఘటన రాజకీయాల్లో పెచ్చుమీరుతున్న అసహనానికి నిదర్శనమని చెప్పవచ్చు.

# ఏఐసీసీ అంటే 'యాక్టింగ్' కమిటీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ తీరుపై నిప్పులు చెరిగారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ తన మౌలిక సిద్ధాంతాలను వదిలేసి, కేవలం నటనపైనే ఆధారపడుతోందని ఆయన విమర్శించారు. ఏఐసీసీ అంటే సాధారణంగా అందరూ అనుకునే 'ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ' కాదని, దానికి కొత్త అర్థం 'యాక్టింగ్ ఈజ్ కాంగ్రెస్ కల్చర్' అని ఆయన ఎద్దేవా చేశారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఉన్న కాంగ్రెస్ నాయకులకు ప్రజల సమస్యల పరిష్కారం కంటే, కెమెరాల ముందు ఎలా నటించాలన్న దానిపైనే శిక్షణ ఇస్తున్నారని దుయ్యబట్టారు.

కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ శిక్షణా తరగతులపై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ తరగతులు పాలనాపరమైన సమీక్షల్లా కాకుండా, సినిమా షూటింగ్‌లకు ముందు చేసే వర్క్‌షాప్‌ల వలె కనిపిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు ఆ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి తీవ్రమైన భావోద్వేగాలను ప్రదర్శిస్తూ నటిస్తున్నారని ఆరోపించారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగానే ప్రజలకు మేలు చేసి ఉంటే, ఇలాంటి రిహార్సల్స్ అవసరం ఉండేది కాదని, ప్రజలే ఆ మార్పును గుర్తించేవారని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ అధికార నిర్మాణాన్ని ఒక షెల్ కంపెనీతో పోల్చారు సంజయ్. ఒకే కుటుంబం యాజమాన్యంలో నడిచే ఈ పార్టీ, రాజకీయ పార్టీలా కాకుండా ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా మారిపోయిందని ధ్వజమెత్తారు. గాంధీ కుటుంబమే ఈ కంపెనీకి యజమానులని, పార్టీ స్క్రిప్ట్ మొత్తం వారి చుట్టూనే తిరుగుతుందని విమర్శించారు. త్యాగాల గురించి మాట్లాడే ఈ మోసపూరిత కంపెనీ తీరు చూస్తుంటే, పెద్ద దొంగలు వచ్చి సామాన్యులకు నీతులు చెప్పినట్లుగా ఉందని ఆయన మండిపడ్డారు. పార్టీ అగ్రనేతలు ఇప్పటికే అనేక అవినీతి కేసులు, చట్టపరమైన విచారణలను ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని గుర్తుచేశారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై కూడా బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. గతంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని, గాంధీ కుటుంబాన్ని ఏ విధంగా విమర్శించారో అందరికీ తెలుసన్నారు. కానీ, కాంగ్రెస్ 'యాక్టింగ్ క్లాసుల్లో' చేరిన తర్వాత ఆయన కూడా పూర్తిగా మాట మార్చేశారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కేవలం గాంధీ కుటుంబం చేసిన త్యాగాల గురించే పదే పదే పాడుతున్నారని, ఇది కేవలం పదవిని కాపాడుకోవడానికి చేస్తున్న నటన మాత్రమేనని విమర్శించారు. కాంగ్రెస్ శిక్షణలో చేరిన తర్వాత ఎవరైనా సరే తమ సొంత వ్యక్తిత్వాన్ని కోల్పోయి, అధిష్టానం చెప్పినట్లు ఆడే బొమ్మల్లా మారుతున్నారని ఆరోపించారు.

స్వాతంత్ర్య పోరాటం, దేశ చరిత్రపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న ధోరణిని సంజయ్ తప్పుబట్టారు. లక్షలాది మంది భారతీయులు చేసిన త్యాగాలను విస్మరించి, స్వాతంత్ర్యం కేవలం ఒకే కుటుంబం వల్ల వచ్చిందన్నట్లుగా రాయల్టీ క్లెయిమ్ చేసుకోవడం హాస్యాస్పదమని అన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చరిత్ర, న్యాయవ్యవస్థను బలహీనపరిచిన అప్రతిష్ట కలిగిన కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయం కోసం ప్రజాస్వామ్య విలువలను కాంగ్రెస్ ఎప్పుడూ తాకట్టు పెడుతూనే ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసాన్ని బండి సంజయ్ వివరించారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రాలు అంటే కేవలం వారి ఢిల్లీ అధిష్టానానికి నిధులు పంపే ఏటీఎం యంత్రాల్లా కనిపిస్తాయని ఆరోపించారు. కానీ భారతీయ జనతా పార్టీకి మాత్రం రాష్ట్రాలు దేశాభివృద్ధికి తోడ్పడే శక్తివంతమైన ఇంజన్లు అని పేర్కొన్నారు. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే సొమ్మును కాంగ్రెస్ నేతలు తమ స్వప్రయోజనాల కోసం, పార్టీ మనుగడ కోసం వాడుకుంటున్నారని, ఇది ప్రజలను వంచించడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే మంత్రంతో ముందుకు సాగుతోందని సంజయ్ తెలిపారు. తమ పాలనలో అందరికీ అభివృద్ధి ఫలాలు అందుతాయని, కానీ ఎవరికీ ప్రత్యేకంగా బుజ్జగింపులు ఉండవని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొన్ని వర్గాలను మాత్రమే బుజ్జగిస్తూ, మెజారిటీ ప్రజల ఆకాంక్షలను కాలరాస్తోందని విమర్శించారు. కేవలం ఎన్నికల లబ్ధి కోసం ప్రజలను విడదీసే రాజకీయాలకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, బీజేపీ మాత్రం అందరినీ కలుపుకుని పోయే అభివృద్ధి బాటలో నడుస్తోందని చెప్పారు.

తెలంగాణ ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ మార్పును కోరుకుంటున్నారని, ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురుచూస్తున్నారని సంజయ్ అన్నారు. రైతు భరోసా, నిరుద్యోగ భృతి వంటి కీలక హామీలను అటకెక్కించి, కేవలం డైలాగులతో కాలక్షేపం చేయడం రేవంత్ సర్కారుకు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మంత్రులు మాత్రం రిహార్సల్స్ చేసుకుంటూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోతే, రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ నేతలకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# ముక్క లేనిదే ముద్ద దిగట్లేదా?



**ఆరోగ్యమస్తు:**

నేటి తరం ఆహారపు అలవాట్లలో చికెన్ ఒక అనివార్య భాగమైపోయింది. ఆదివారం మాత్రమే కాదు.. వీలు చిక్కినప్పుడల్లా చికెన్ వెరైటీలతో విందు చేసుకోవడం చాలామందికి అలవాటు. నిజానికి చికెన్ ఇష్టపడని వారు అరుదుగా ఉంటారు. కొందరు వారానికి రెండు మూడు సార్లు తింటే, మరికొందరు మాత్రం రోజూ ముక్క లేనిదే ముద్ద దిగదని చెబుతుంటారు. జిమ్ చేసే వారైతే ప్రోటీన్ కోసం చికెన్‌ను ఆహారంలో తప్పనిసరి చేసుకుంటారు. అయితే, రుచికి బాగుంది కదా అని రోజూ చికెన్ లాగించేయడం ఆరోగ్యానికి ఎంతవరకు క్షేమమనే చర్చ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రోటీన్లు పుష్కలంగా లభించే చికెన్ ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నది నిజమే అయినా, అది అతిగా మారినప్పుడు అనర్థాలకు దారితీస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వారానికి ఒకటి లేదా రెండుసార్లు పరిమితంగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. కానీ అదే పనిగా రోజూ తింటే మాత్రం శరీరంలో ప్రోటీన్ల మోతాదు అసాధారణంగా పెరిగిపోతుంది. ఇలా ప్రోటీన్లు మితి మీరినప్పుడు మూత్రపిండాలపై భారం పడటమే కాకుండా, శరీరంలోని జీవక్రియల సమతుల్యత దెబ్బతింటుంది. ఏదైనా మితంగా ఉన్నప్పుడే అమృతంలా పనిచేస్తుందని గుర్తించాలి.

ముఖ్యంగా రోజూ చికెన్ తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఎక్కువగా ఉంది. చికెన్‌లో ఫైబర్ చాలా తక్కువగా ఉంటుంది, దీనివల్ల జీర్ణ ప్రక్రియ నెమ్మదిస్తుంది. మాంసాహారం అరగడానికి శరీరం ఎక్కువ కష్టపడాల్సి ఉంటుంది. రోజూ చికెన్ తినడం వల్ల మలబద్ధకం సమస్య తీవ్రమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది దీర్ఘకాలంలో పైల్స్ వంటి సమస్యలకు కూడా దారితీయవచ్చు. అందుకే జీర్ణక్రియ సజావుగా సాగాలంటే మాంసాహారాన్ని పరిమితం చేసి, పీచు పదార్థం ఎక్కువగా ఉండే కూరగాయలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

గుండె ఆరోగ్యానికి కూడా నిత్యం చికెన్ తినడం మంచిది కాదని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. చికెన్‌లో ప్రోటీన్లతో పాటు సాచురేటెడ్ ఫ్యాట్ అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో ఎల్‌డీఎల్ అనే చెడు కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడం వల్ల రక్తపోటు పెరిగి, గుండె జబ్బుల ముప్పు పొంచి ఉంటుంది. ఈ రోజుల్లో యువతలో కూడా గుండె జబ్బులు పెరుగుతున్న నేపథ్యంలో, ఆహారంలో కొవ్వు పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండటం అవసరం. కేలరీలు ఎక్కువగా ఉండటం వల్ల బరువు కూడా వేగంగా పెరుగుతారు.

మరో ప్రధానమైన అంశం ఏమిటంటే.. ప్రస్తుత కాలంలో మార్కెట్లో లభించే బ్రాయిలర్ చికెన్ పెంచే విధానం. కోళ్లు త్వరగా పెరగడానికి అనేక రకాల హార్మోన్ ఇంజెక్షన్లు, యాంటీ బయోటిక్స్ వాడుతున్నారు. ఇలాంటి చికెన్‌ను రోజూ తీసుకోవడం వల్ల మనుషులలో కూడా హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. ముఖ్యంగా ఆడపిల్లల్లో చిన్న వయసులోనే శారీరక మార్పులు రావడం, పీసీఓడీ వంటి సమస్యలకు ఈ ఆహారపు అలవాట్లే కారణమని వైద్యులు విశ్లేషిస్తున్నారు. రసాయనాలతో కూడిన ఆహారం శరీరంలోని అంతర్గత వ్యవస్థను దెబ్బతీసే ప్రమాదం ఉంది. బ్రాయిలర్ కోళ్లలో సాల్మొనెల్లా వంటి బాక్టీరియా ఉండే అవకాశం ఉంది. సరిగ్గా ఉడికించని చికెన్ లేదా కలుషితమైన మాంసం తిన్నప్పుడు ఈ బాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు, విరేచనాలకు దారితీస్తుంది. తరచుగా చికెన్ తినే వారిలో ఇన్ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. బాక్టీరియా ప్రభావం వల్ల రోగనిరోధక శక్తి కూడా క్షీణించే అవకాశం ఉంది. అందుకే మాంసాహారాన్ని శుభ్రంగా కడిగి, బాగా ఉడికించిన తర్వాతే తీసుకోవాలి. చాలామంది చికెన్‌ను రకరకాల మసాలాలు, నూనెతో వేయించి తింటుంటారు. ఇలా ఫ్రై చేసిన చికెన్ తీసుకోవడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఫలితంగా మొటిమలు రావడం, నోటి పూత, గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తుతాయి. రోజూ మసాలాలు నిండిన చికెన్ తినడం వల్ల గుండెల్లో మంట, అసిడిటీ సమస్యలు పెరుగుతాయి. ముఖ్యంగా రాత్రిపూట చికెన్ తిని పడుకోవడం వల్ల నిద్రలేమి సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. రాత్రి భోజనం ఎప్పుడూ తేలికగా ఉండేలా చూసుకోవడం ఉత్తమం. బరువు తగ్గాలనుకునే వారు చికెన్ తింటే మేలని భావిస్తారు కానీ, అది కేవలం బాయిల్ చేసిన మాంసం అయితేనే సాధ్యం. సాధారణంగా మనం వండుకునే పద్ధతిలో కేలరీలు భారీగా ఉంటాయి.

# మరో బాంబు పేల్చిన ట్రంప్

**మొదటిపేజీ తరువాయి**



న్యాయస్థానం తీర్పు వెలువడిన కొద్ది గంటల వ్యవధిలోనే తనదైన శైలిలో స్పందించిన ఆయన, సెక్షన్ 122 కింద ఉన్న విశేష అధికారాలను ఉపయోగించి కొత్తగా ఈ సుంకాలను విధిస్తూ ఉత్తర్వులపై సంతకం చేశారు. ఇది ప్రపంచ దేశాలకు ఒక రకమైన హెచ్చరికగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ తన నిర్ణయాన్ని కేవలం 10 శాతానికే పరిమితం చేయకుండా, దానిని పునఃసమీక్షించి గరిష్ట స్థాయి అయిన 15 శాతానికి పెంచడం గమనార్హం. శనివారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఆయన ఈ బాంబు పేల్చారు. "ప్రపంచ దేశాలపై విధిస్తున్న 10 శాతం సుంకాన్ని 15 శాతానికి పెంచాలని నిర్ణయించుకున్నాను. ఇది తక్షణమే అమలులోకి రానుంది" అని ఆయన స్పష్టం చేశారు. దశాబ్దాలుగా అనేక దేశాలు అమెరికా ఆర్థిక వ్యవస్థను అడ్డం పెట్టుకుని లాభపడుతున్నాయని, అమెరికాను దోచుకుంటున్నాయని ఆయన ఘాటుగా విమర్శించారు. అమెరికా ప్రయోజనాలను కాపాడటమే తన ప్రథమ కర్తవ్యమని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. అమెరికా చట్టాల ప్రకారం సెక్షన్ 122 అనేది అధ్యక్షుడికి అసాధారణ అధికారాలను కల్పిస్తుంది. దీని ప్రకారం దేశ ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని అధ్యక్షుడు గరిష్టంగా 15 శాతం వరకు దిగుమతి సుంకాలు విధించవచ్చు. ఈ సుంకాలు ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండానే 150 రోజుల వరకు అమలులో ఉంటాయి. అయితే, ఈ 150 రోజుల గడువు ముగిసిన తర్వాత కూడా వీటిని కొనసాగించాలంటే అమెరికా కాంగ్రెస్ ఆమోదం తప్పనిసరి. ప్రస్తుతానికి ఈ 150 రోజుల వ్యవధిలో ప్రపంచ వాణిజ్యంపై దీని ప్రభావం ఎలా ఉంటుందోనని వ్యాపార వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ట్రంప్ తన వ్యాఖ్యల్లో రాబోయే కొద్ది నెలల్లో చట్టబద్ధంగా అనుమతించదగిన మరిన్ని టారిఫ్‌లను అమల్లోకి తెస్తానని చెప్పడం గమనార్హం.

ఈ నిర్ణయం వల్ల భారత్ సహా అనేక దేశాల నుంచి అమెరికాకు వెళ్లే వస్తువుల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఐటీ సేవలు, ఫార్మా, ఆటోమొబైల్ మరియు టెక్నాలజీ రంగాలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉండనుంది. అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై 15 శాతం అదనపు భారం పడటం వల్ల అక్కడి వినియోగదారులకు కూడా ధరల సెగ తగలనుంది. అయితే, 'అమెరికా ఫస్ట్' అనే నినాదంతో ముందుకు సాగుతున్న ట్రంప్, స్వదేశీ తయారీ రంగాన్ని ప్రోత్సహించడానికి మరియు విదేశీ దిగుమతులను తగ్గించడానికి ఈ ఎత్తుగడ వేశారు. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలను తోసిరాజని ఆయన తీసుకున్న ఈ నిర్ణయంపై ఇతర దేశాలు ఎలా స్పందిస్తాయో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించకుండా, చట్టంలోని లొసుగులను వాడుకుంటూ ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడంపై అమెరికాలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డెమొక్రాట్లు ఈ చర్యను నియంతృత్వ ధోరణిగా అభివర్ణిస్తుండగా, ట్రంప్ మద్దతుదారులు మాత్రం ఇది దేశాభివృద్ధికి అవసరమైన చర్య అని సమర్థిస్తున్నారు. న్యాయస్థానంతో ఈ రకమైన ఘర్షణ వాతావరణం దేశ రాజ్యాంగ వ్యవస్థపై ఎటువంటి ప్రభావం చూపుతుందోనని మేధావులు ఆందోళన చెందుతున్నారు. కానీ ట్రంప్ మాత్రం తన మార్కు రాజకీయాలతో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పును కేవలం ఒక సాంకేతిక అడ్డంకిగా మాత్రమే భావించిన ఆయన, దానిని అధిగమించేందుకు సెక్షన్ 122ను ఆయుధంగా మలుచుకున్నారు.

ట్రంప్ టారిఫ్ యుద్ధం వల్ల ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది. షేర్ మార్కెట్లు కూడా ఈ వార్తతో ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న గ్లోబల్ సప్లై చైన్ (సరఫరా గొలుసు) ఈ నిర్ణయంతో చెల్లాచెదురయ్యే ప్రమాదం ఉంది. అమెరికాకు ఎగుమతులు చేసే చైనా, యూరోపియన్ యూనియన్, ఆసియా దేశాలు ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల కోసం వెతుక్కుంటున్నాయి. ఒకవేళ ఆయా దేశాలు కూడా ప్రతిచర్యగా అమెరికా వస్తువులపై సుంకాలు పెంచితే, అది గ్లోబల్ ట్రేడ్ వార్‌కు దారితీసే అవకాశం ఉంది. ఇది అంతిమంగా ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటును దెబ్బతీస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఈ టారిఫ్ల పెంపు వల్ల అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగే ముప్పు ఉందని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దిగుమతి అయ్యే ముడి సరుకులు, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు పెరిగితే, ఆ భారం సామాన్య అమెరికన్ పైనే పడుతుంది. కానీ ట్రంప్ వాదన మరోలా ఉంది. టారిఫ్ల ద్వారా వచ్చే ఆదాయంతో అమెరికా అప్పులను తగ్గించవచ్చని, అలాగే విదేశీ కంపెనీలు అమెరికాలోనే ప్లాంట్లు ఏర్పాటు చేసేలా ఒత్తిడి తీసుకురావచ్చని ఆయన భావిస్తున్నారు. ఈ రిస్క్ తో కూడిన వ్యూహం ఫలిస్తుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా, వైట్ హౌస్ నుంచి వచ్చే ప్రతి ఉత్తర్వు ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గమనాన్ని మార్చేలా ఉంది.

భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇది ఒక సవాల్ లాంటిదే. అమెరికా మనకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. 15 శాతం టారిఫ్ అంటే మన ఎగుమతిదారుల లాభాలు ఆవిరి కావడమే. భారత ప్రభుత్వం ఇప్పటికే అమెరికా వాణిజ్య ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అయితే ట్రంప్ ఎవరి మాట వినే పరిస్థితిలో లేరని ఆయన తాజా పోస్టులు చెబుతున్నాయి. 'దోచుకుంటున్నారు' అనే పదాన్ని వాడటం ద్వారా ఆయన ప్రపంచ దేశాలపై ఉన్న తన అసహనాన్ని బహిర్గతం చేశారు. ఈ వైఖరి అంతర్జాతీయ సంబంధాల్లో ఒక కొత్త ఉద్రిక్తతకు దారితీసేలా కనిపిస్తోంది.

# దేశ పరువు తీయొద్దు



**మొదటిపేజీ తరువాయి**

ఇలాంటి ప్రదర్శనలు చేయడం వల్ల భారతదేశ గౌరవప్రతిష్టలు మసకబారుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదని, దేశ ప్రతిష్టకు సంబంధించిన అంశమని ఆయన స్పష్టం చేశారు. ఏఐ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప అవకాశాన్ని కాంగ్రెస్ నేతలు తమ స్వార్థ రాజకీయాల కోసం పక్కదారి పట్టించడం అత్యంత విచారకరమని కేటీఆర్ విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించేందుకు, సాంకేతిక సహకారాన్ని పెంపొందించుకోవడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయని, కానీ అక్కడ నిరసనలు తెలపడం వల్ల దేశంపై పెట్టుబడిదారులకు ప్రతికూల సంకేతాలు వెళ్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అయితే ఎక్కడ, ఏ సమయంలో ఆ నిరసన వ్యక్తం చేయాలో కనీస అవగాహన ఉండాలని హితవు పలికారు. అంతర్జాతీయ వేదికలు ఖచ్చితంగా రాజకీయ అసమ్మతిని వ్యక్తం చేసే ప్రదేశాలు కావని ఆయన సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు.

ఈ మొత్తం ఉదంతంలో విచిత్రమైన అంశం ఏమిటంటే, అదే సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన చేపట్టడం. సొంత పార్టీ ముఖ్యమంత్రి ఒక అంతర్జాతీయ వేదికపై రాష్ట్రం మరియు దేశం తరపున మాట్లాడుతుంటే, అదే పార్టీకి చెందిన కార్యకర్తలు గందరగోళం సృష్టించడం కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత సమన్వయ లోపాన్ని ఎత్తిచూపుతోందని విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి చర్యలు కేవలం అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా, విదేశీ ప్రతినిధుల ముందు భారత్ అంటే ఒక గందరగోళమైన దేశమనే భావనను కలుగజేస్తాయని కేటీఆర్ ఆరోపించారు. రాజకీయ వేదికలకు, సాంకేతిక సదస్సులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించలేని స్థితిలో కాంగ్రెస్ నాయకత్వం ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

మరోవైపు, ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృత్రిమ మేధస్సు వినియోగంపై తన ఆలోచనలను పంచుకున్నారు. దేశంలో ఏఐ పురోగతిని పర్యవేక్షించేందుకు, చట్టపరమైన రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ స్థాయిలో 'ఏఐ కౌన్సిల్'తో పాటు ప్రత్యేకంగా 'ఏఐ మంత్రిత్వ శాఖ'ను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుత కాలంలో సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తోందో, దానికి అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం కూడా సిద్ధం కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ భద్రత దృష్ట్యా కూడా ఏఐ నియంత్రణ మరియు ప్రోత్సాహం ఒకే మంత్రిత్వ శాఖ పరిధిలో ఉండటం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఆయన ప్రతిపాదించారు. రేవంత్ రెడ్డి చేసిన ఈ ప్రతిపాదనలు సదస్సులోని ప్రతినిధుల దృష్టిని ఆకర్షించాయి. తెలంగాణ రాష్ట్రాన్ని ఏఐ హబ్‌గా మార్చాలన్న తన సంకల్పాన్ని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశంలోనే తొలిసారిగా 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కోరారు. అలాగే, ఏఐ విప్లవంలో భారత్ కేవలం సేవలు అందించే దేశంగానే కాకుండా, కొత్త ప్లాట్‌ఫార్మ్‌లను సృష్టించే దేశంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. గూగుల్, మెటా, వాట్సాప్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలను భారత్ సృష్టించలేకపోవడాన్ని ఆయన గుర్తు చేస్తూ, ఏఐ రంగంలో అటువంటి అద్భుతాలను సృష్టించే శక్తి మన యువతకు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ సభ్యులు సన్మానం



**ఆర్మూర్, విశాలభారతి:** నందిపేట మండల కేంద్రంలోని పలుగుట్ట ప్రాంతంలో ఉన్న పెద్దమ్మతల్లి వార్షికోత్సవాల భాగంగా మాయపూర్ గ్రామానికి చెందిన రోడ్డ రవి ని ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఆలయ కమిటీకి తన వంతు సాయంగా అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



**నిజామాబాద్, విశాలభారతి :** మాక్లూర్ మండలం మాణిక్ బండార్ 63 జాతీయ రహదారి పైన బిజెపి నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. మాక్లూర్ మండల్ బిజెపి నాయకులు మాట్లాడుతూ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అక్రమంగా అరెస్టు చేసినందుకు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసినట్లు. మరియు ప్రజా పాలన ముసుగులో నిరంకుశ పాలన చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం వైఫల్యాలను నిరంతరం ప్రజాముకంగా ఎత్తి చూపితే ప్రజాస్వామ్య విధంగా పరిపాలన చేయాలని అడిగితే అక్రమ కేసులతో అరెస్టుల గత కొంతకాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనాన్ని ఎండ గడుతున్న ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గారు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి గారి క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గుండాలు చేసిన దాడిని ఖండిస్తూ ఎమ్మెల్యేకు మద్దతుగా ఎమ్మెల్సీ అంజి రెడ్డి గారితో కలిసి కామారెడ్డికి బయలుదేరే మార్గమధ్యలో అక్రమ అరెస్టు చేయడం భారతీయ జనతా పార్టీ తరపున మేం తీవ్రంగా ఖండిస్తున్నాం ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.

## ఏ.ఐ.ఎన్.యు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- **ప్రారంభించిన మంజుల దీలిప్ రెడ్డి సర్పంచ్**



**చౌటుప్పల్ విశాలభారతి:** మండలంలోని అల్లపురం గ్రామంలో ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ యూరాలజీ హాస్పిటల్ యజమాన్యం అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో బీపీ,షుగర్,సిరం క్రియాటినైన్,ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసిన ఏ.ఐ.ఎన్.యు డాక్టర్లకు మరియు సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ,ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో నిర్వహించి ప్రజలను వైద్య,ఆరోగ్య సంబంధించిన తగిన జాగ్రత్తలు గురించి తెలిపి వారిని చైతన్య పరచాలని సందర్భంగా వారికి సూచించారు.అలాగే జీవనది ఫౌండేషన్ డైరెక్టర్ లక్ష్మీ దుర్గ మాట్లాడుతూ..ప్లాస్టిక్ వాడడంతో క్యాన్సర్ కు దారితీస్తుందని మనం వాడే ప్లాస్టిక్ గ్లాసులు,పేపర్ ప్లేట్లు,క్యారీ బ్యాగులు పూర్తిగా నివారించాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బోయిని లింగస్వామి పాలకవర్గం,డాక్టర్లు గౌతమి,శంకర్ గౌడ్,మెడికల్ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అర్చరి పోటిలో శ్రీనిక కు బ్రోంజ్ మేడల్




**ఆర్మూర్,విశాలభారతి:** డొంకేశ్వర్ మండలంలోని తొండకూర్ గ్రామానికి చెందిన మద్దుల శ్రీనిక ఖమ్మంలో జరుగుతున్న సీఎం రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలలో బ్రోంజ్ మెడల్ సాధించింది.ఈ పోటీలలో నిజామాబాద్ జిల్లా తరపున శ్రీనిక తన ప్రతిభను చాటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ఖమ్మంలో జరిగిన సీఎం కప్ అర్చరిలో రాణించడం పట్ల జిల్లా క్రీడాకారిని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## శివలింగం గజ స్థంభం విగ్రహ ప్రతిష్టాపన



**ఆర్మూర్, విశాలభారతి:** నందిపేట్ మండలంలోని కంఠం గ్రామంలో శనివారం శివలింగం మరియు గజ స్టంబన్ని ప్రతిష్టించారు. దాతల సహాయంతో అలాగే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం యజ్ఞం చేశారు. భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అజిగిరి సాయినాథ్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పాలనకు కొత్త దిశ

- **వార్డు సభ్యుల ఐదు రోజుల శిక్షణ విజయవంతం!**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్:** ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపొందిన గ్రామ వార్డు సభ్యులకు పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 17వ తేదీ నుండి ఐదు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో విజయవంతంగా ముగిశాయి. అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని 14 గ్రామాలకు చెందిన మొత్తం 133 మంది వార్డు సభ్యులకు మండల కార్యాలయంలో ప్రత్యేకంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణా తరగతుల్లో గ్రామ పాలన, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, ప్రజాసేవ విధానాలు, ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణ, గ్రామ సభల నిర్వహణ తదితరంగా మొత్తం 19 అంశాలపై సమగ్రంగా తర్ఫీదు అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీవాణి, ఇన్చార్జ్ ఎంపీఓ సి.హెచ్. శ్రీనివాస్, తుల్జా ప్రసాద్ రావు మాట్లాడుతూ.. వార్డు సభ్యులకు సరైన అవగాహన కల్పించడం ద్వారా గ్రామపంచాయతీలు మరింత బలోపేతం కావడంతో పాటు పారదర్శకమైన, ప్రజా కేంద్రిత పాలన అందించగలమని పేర్కొన్నారు. శిక్షణ ద్వారా గ్రామ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు అవుతాయని వారు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శిక్షణ అందించిన అధికారులను వార్డు సభ్యులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామల సెక్రటరీలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలేవి

- **కుంటని మాయం చేస్తున్నా పట్టించుకోని అధికారులు**
- **సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి తీవ్ర విమర్శలు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:** అబ్దుల్లాపూర్ మండల పరిధిలోని హత్తిగూడా రెవిన్యూ సర్వే నంబర్ 19 హయత్ నగర్ మండల పరిధిలోని సర్వే నంబర్ 98లో కలిపి సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చిన్న కుంట మరియు ఆయకట్టుకు వెళ్లే నాలాను అక్రమంగా పూడ్చి, పక్కనే ఉన్న 2.5 ఎకరాల బిల్ల దాఖల భూమి సహా ప్రభుత్వ భూమిని ఆక్రమించి వెంచర్ వేస్తూ విల్లాల నిర్మాణం చేపడుతున్న కబ్జాదారులపై రెవిన్యూ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి ఆగ్రహం వ్యక్తం చేశారు.శనివారం నాడు అబ్దుల్లాపూర్ మెట్ మరియు హయత్ నగర్ మండలాల పరిధిలో కబ్జాకు గురవుతున్న హత్తిగూడా చిన్న కుంట, దాని నాలాను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ.. తక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రైవేట్ భూమిని సాకుగా చూపుతూ, హత్తిగూడా చిన్న కుంట మరియు దాని నాలాను పూర్తిగా పూడ్చి వేసి, కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్రమంగా విల్లాల నిర్మాణం చేపడుతున్నాడని ఆరోపించారు. రెవిన్యూ అధికారులను మోసం చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్న కబ్జాదారులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై 2023 సంవత్సరంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా కొంతకాలం నిర్మాణ పనులు నిలిచిపోయాయని, అయితే తిరిగి ఇప్పుడు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ నెల 16న హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కనీసం నిర్మాణాలను నిలిపివేయకపోవడం అనుమానాస్పదంగా ఉందని అన్నారు. ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుంటే వెంటనే అడ్డుకునే అధికారులు, కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి, నాలా కబ్జా అయినా కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.హత్తిగూడా చిన్న కుంట చాలా పురాతనమైనదని, ఎల్‌బి నగర్ సర్కిల్ పరిధిలోని అనేక కాలనీల వర్షపు నీరు ఈ కుంటలో చేరుతుందని తెలిపారు. ఈ కుంట నుంచి అలుగు పోయే నాలా పూర్తిగా కనుమరుగైపోయిందని, దాని స్థానంలో వెంచర్ చేసి నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. అందువల్ల రెవిన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు తక్షణమే స్పందించి సర్వే నిర్వహించి, కబ్జాకు గురైన సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని మరియు ఆయకట్టు నాలాను రక్షించి, కుంటకు పూర్వ వైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్ మెట్ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, బిఓసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, సిపిఐ నాయకులు వద్యా రమేష్ నాయక్, పేరాల గోపి, నిరంజన్, ఉప్పలయ్య, అశోక్, పాండు, ప్రియా, అన్నపూర్ణ, రాజు, విరమల్లు, మాల్సూర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా మెటీరియల్ పంపిణీ




**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజు పల్లి గ్రామానికి చెందిన జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు, అదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రాపాక సుమన్, లక్ష్మణ్ కలిసి ఈరోజు 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అవసరమైన ప్యాడ్ మరియు పెన్నులు అధ్యయన సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ కొండ ఊర్మిళా మల్లారెడ్డి, ఉపసర్పంచ్ జోగు అనిల్ హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు జీవితంలో మొదటి కీలక మెట్టు ఎక్కుతున్నారని కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత మార్కులు సాధించడం సులభమని సూచించారు. పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి సహాయ సహకారాల అందించడం అభినందనీయమని, పేర్కొన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు కూడా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగి తమ పాఠశాలను గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే పరీక్షలు ధైర్యంగా అత్మవిశ్వాసంతో రాసి మెరుగైన ఫలితాలు సాధించి ఉన్నత విద్యకు బాటలు వేయాలని, తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్స్ రాపాక యాదగిరి, మేడ రాజు, గ్రామ పెద్దలు ఊట్ల శివ,నల్ల యాదగిరి, వడ్లకొండ సోమయ్య, అటికం నరసయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

## ముచ్చింతల్ స్వర్ణ భారతీ నిలయంలో సర్పంచుల శిక్షణ ముగింపు



- **ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రదానం**

**విశాలభారతి, అబపుల్లాపూర్ మెట్ :** ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన గ్రామపంచాయతీ సర్పంచులకు ఐదు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శంషాబాద్ మండలం ముచ్చింతలలోని స్వర్ణ భారతీ ట్రస్ట్ నిలయంలో ఘనంగా ముగిసింది. గ్రామ పాలన, అభివృద్ధి ప్రణాళికలు, నిధుల వినియోగం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై సర్పంచులకు సమగ్ర అవగాహన కల్పించేందుకు జిల్లా పంచాయతీ రాజ్ అధికారి సురేష్ మోహన్,మండల ఎంపీడీవో శ్రీవాణి ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి స్థానిక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణ పూర్తి చేసిన సర్పంచులకు తన చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని గ్రామాల అభ్యున్నతికి వినియోగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు సాధన , ప్రజాప్రతినిధులు, శిక్షణ నిర్వాహకులు, సర్పంచులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జిల్లా వైద్యాధికారులు

- **ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు మృతికి కారణమైన వైద్యులు**
- **నర్సులను వెంటనే సస్పెండ్ చేయాలి**
- **ఆస్పత్రి ఎదుట బాధితులు ఆందోళన**
- **అధికారుల చొరవతో ఆందోళన విరామం**
- **యాచారం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు రాజ్యలక్ష్మిపై కలెక్టర్ కు నివేదిక అందిస్తామన్న డిఎంహెచ్ఓ**



**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా యాచారం ప్రభుత్వ ఆసుపత్రిలో మల్కీజుగూడకు చెందిన నాన్కంపేట కళ్యాణి ప్రసవం కోసం ఈనెల 19న ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన విషయం విధితమే కాగా వైద్యురాలు రాజ్యలక్ష్మి నిర్లక్ష్యంతో వైద్యం వికటించి నవజాత శిశువు మృతిచెందిన ఘటనతో శనివారం జిల్లా వైద్యాధికారి ఓ.లలితాదేవి, డిప్యూటీ డిఎంహెచ్ఓ లక్ష్మీ ప్రసన్న, డిసిహెచ్ఎస్ అనురాగిణి గైనకాలజిస్ట్ జలజ శనివారం ప్రభుత్వ ఆస్పత్రికి సందర్శించి వాస్తవ విషయాలను వైద్యులను బాధిత కుటుంబాన్ని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సందర్శించిన అధికారులకి మల్కిజ్గూడ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ రెడ్డమోని శిరీష వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఆసుపత్రిని పరిశీలించిన అనంతరం ఉన్నత స్థాయి అధికారులు మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య పరికరాల కొరత ఉందన్న విషయం వాస్తవమేనని ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రసవ సమయంలో వైద్యులు వైద్య సేవల విషయమై పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ న్యాయబద్ధంగా పోరాడుతామని గ్రామస్తులు చెప్పారు. గ్రామస్తులు మండల వివిధ గ్రామాల ప్రజలు ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు ఆందోళనలో మృతికి కారణమైన డాక్టర్ , నర్సులను వెంటనే సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు రాజ్యలక్ష్మి పై జిల్లా కలెక్టర్ కు డిఎంహెచ్ఓ అధికారులకు చర్యల నిమిత్తం నివేదిక అందజేశారు. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి లు ప్రత్యేక చొరవ తీసుకుని యాచారం ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని రంగాలతో తీర్చిదిద్ది 24 గంటలు వైద్యం అందేవిధంగా వైద్యులను ఏర్పాటు చేయాలని గుర్తు చేశారు.

## గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా మధు పార్క్ రిడ్జ్ నివాసితుల ఆందోళన




**రాజేంద్రనగర్, విశాలభారతి :** గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ పరిధిలో ప్రతిపాదిత గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ నేపథ్యంలో మధు పార్క్ రిడ్జ్ గేటెడ్ కమ్యూనిటీ నివాసితుల్లో ఆందోళన నెలకొంది. ప్రాజెక్ట్ కోసం సుమారు పదిఎకరాల ముప్పైగుట్టలు ఎకరాల స్థలాన్ని సేకరించనున్నట్లు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూసీ–ఈసీ నదులు కలిసే ప్రాంతంలో ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేసి ఎత్తైన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ప్రణాళికలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రాజెక్ట్ కోసం తగిన పరిహారం చెల్లిస్తామని, సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అయితే నివాసితులు పరిహారం అవసరం లేదని, తాము ఎన్నేళ్లుగా నివసిస్తున్న తమ ఇళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలి వెళ్లబోమని స్పష్టం చేశారు. అప్పులు చేసి ప్లాట్లు కొనుగోలు చేశామని, ఇప్పుడు అవి ఎలా ఇవ్వగలమని ప్రశ్నించారు. "ప్రాణాలైనా ఇస్తాం కానీ ఇళ్లు ఇవ్వం" అంటూ ఆందోళన చేపట్టారు.

కొంతమంది వృద్ధులు మీడియా ఎదుట భావోద్వేగానికి గురయ్యారు. "డబ్బులు, మాణిక్యాలు వద్దు… మా ఇళ్లు కావాలి" అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఖాళీగా ఉన్న సర్కారు భూముల్లో ప్రాజెక్ట్ నిర్మించవచ్చుకదా అని సూచించారు.ఈ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు. ప్రస్తుతం పరిస్థితి ఉద్రిక్తంగా మారగా, అధికారులు చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని భావిస్తున్నారు.

## రైతన్నలను ఇబ్బంది పెట్టడమేనా ప్రజాపాలన!

- **మూడు నెలలైన పంట అమ్ముకున్న పైసలు వెయ్యరా?**
- **పాలన చేతకాకుంటే దిగిపోండి**
- **కేశంపేట మాజీ ఎంపీపీ వై.రవీందర్ యాదవ్**



**కేశంపేట, విశాలభారతి:** రైతులు ఎంతో చెమటోర్చి తాము పండించిన పంటను ప్రభుత్వానికి అమ్ముకుంటే మూడు, నాలుగు నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాలో మొక్కజొన్న పంట పైసలు జమ చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టడమేనా ప్రజాపాలన అంటే అని కేశంపేట మాజీ ఎంపీపీ వై.రవీందర్ యాదవ్ అన్నారు. శనివారం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక, నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులతో కలిసి కేశంపేట మండలం కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని,రాష్ట్రంలోని అనేక గ్రామాలు, పట్టణాల్లో ఎరువుల పంపిణీ కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి నిరీక్షిస్తున్న దృశ్యాలు మనం చూసామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుభరోసా డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని దుస్థితి నెలకొన్నదని పంటల సాగు కోసం రైతులు అప్పులు చేసి తిప్పలు పడుతున్నా నిధులు మాత్రం సక్రమంగా రావడంలేదన్నారు. చివరకు తాము పండించిన పంటను అమ్ముకున్న నెలలు గెలుస్తున్న డబ్బులు ఇవ్వకపోవడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.అబద్ధాల పునాదుల మీద ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలని మోసం చేయడమే కాకుండా, చివరికి అన్నం పెట్టే రైతన్నను కూడా నట్టేట ముంచుతూ, గత నాలుగు నెలల నుండి మొక్కజొన్న రైతులకు ఖాతాలలో డబ్బులు వేయకుండా, యాసంగి పంటకు రైతు భరోసా వేయకుండా రైతుల ఉసురు పోసుకుంటుందని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. వచ్చే వారం రోజులలో రైతుల ఖాతాల్లో డబ్బులు పడకపోతే సోమవారం రోజున మండల కేంద్రంలో మహాధర్న కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్,నాయకులు సజ్జల విశ్వనాథం, తలసాని వెంకట్ రెడ్డి ,నవీన్ కుమార్, మల్లేష్ యాదవ్, జమాల్ ఖాన్, వేణుగోపాలచారి, కానం ప్రేమ్ కుమార్ గౌడ్, అంజి రెడ్డి, తిరుమల్ రెడ్డి శ్రీనివాస్, జగన్ రెడ్డి, సాజిద్, పంది రాంరెడ్డి, నక్క గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాల నివారణ సమీక్షా సమావేశం

- **చెత్త నిల్వలే అగ్నిప్రమాదాలకు కారణం - ఏసీపీ నరేష్ రెడ్డి**



**కూకట్ పల్లి, విశాలభారతి:** వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో నగరంలో పెరుగుతున్న అగ్నిప్రమాదాల నివారణే లక్ష్యంగా బాలానగర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. శనివారం బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది మరియు స్వచ్ఛ ఆటో నిర్వాహకులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ నరేష్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల చోటుచేసుకున్న పలు అగ్నిప్రమాదాలకు రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారమే ప్రధాన కారణమని ఏసీపీ విశ్లేషించారు. దేశ సరిహద్దుల్లో సైనికులు ఎలాగైతే రక్షణ కల్పిస్తారో, ప్రజారోగ్యాన్ని కాపాడటంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారని వారి సేవలను కొనియాడారు. స్వచ్ఛ ఆటో నిర్వాహకులు ప్రతిరోజూ నిర్ణీత సమయానికి చెత్తను సేకరించి, వెంటనే డంపింగ్ యార్డులకు తరలించాలని ఆదేశించారు. అనంతరం సమావేశంలో సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ, రోడ్లపై చెత్త పేరుకుపోవడం వల్ల కేవలం అగ్నిప్రమాదాలే కాకుండా, దోమల బెడద, వీధి కుక్కల సమస్యలు, రోడ్డు ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా బాధ్యతారాహిత్యంగా రోడ్లపై చెత్త వేస్తే వారి వివరాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలి. అగ్నిప్రమాదాల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సీఐ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏలు నాగరాజు, పాండు, స్వచ్ఛ ఆటో నిర్వాహకులు జి. బాలయ్య, సుంకన్న, పెద్దయ్య, రామాంజి, సూరి, సుధా తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స అనంతరం 6 నెలల శిశువు మృతి




**రాజేంద్రనగర్, విశాలభారతి :** సన్ సిటీ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. రాము అనే ఆరు నెలల శిశువు చికిత్స లో భాగంగా మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. శిశువుకు జ్వరం రావడంతో తల్లిదండ్రులు సమీపంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. అక్కడ వైద్యులు గడువు ముగిసిన మందు ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మందు ఇచ్చిన కొద్దిసేపటికే బాలుడి ఆరోగ్యం విషమించిందని, పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో మృతి చెందినట్లు వారు తెలిపారు. ఈ ఘటనపై బాధిత కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. స్థానికులు కూడా ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆస్పత్రి నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. అధికారిక నివేదిక వెలువడాల్సి ఉంది.

## యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం

- **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**



**రంగారెడ్డి ,విశాలభారతి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 23వ తేదీ సోమవారం యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## పెద్ద చెరువును సందర్శించిన ఇరిగేషన్ శాఖ అధికారులు



**కేశంపేట,విశాలభారతి:** మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో శనివారం గ్రామ సమీపంలోని ఉన్న పెద్ద చెరువును కేశంపేట ఇరిగేషన్ శాఖ ఏఈ పాతిన సందర్శించారు. శుక్రవారం గ్రామానికి విచ్చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి పెద్ద చెరువు సమస్య గురించి రైతులు విన్నవించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఏఈ పాతిన చెరువును సందర్శించి పునరుద్ధరణ కోసం నివేదికలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెదురు వెల్లి భాస్కర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, వార్డు సభ్యులు నాగరాజు, మంజుల జంగేశ్, నాయకులు ముత్యాలు, సత్యనారాయణ, జానకిరాములు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా మేకల శ్రీనివాస్ యాదవ్



**ముషీరాబాద్,విశాలభారతి:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గా మేకల శ్రీనివాస్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం విద్యానగర్ బీసీ భవన్ లో జరిగిన సమావేశంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు సాదాన్నే లక్ష్యంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. మేకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మరో బీసీ ఉద్యమ పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాదవ పోరాట సంఘం నేషనల్ ప్రెసిడెంట్ మేకల రాములు యాదవ్, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు శ్యామల లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని యువకుడు మృతి

- **కేసు నమోదు చేసిన పోలీసులు**



**అశ్వాపురం, విశాలభారతి :** ఉరేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటనపై అశ్వాపురం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. సీఐ జి. అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొండికుంట గ్రామానికి చెందిన సున్నం జయంత్ (22) అను వ్యక్తి తండ్రి బాలరాజు గతంలో ప్రమాదంలో మరణించాడు. ఈ క్రమంలో తల్లి కూడా అతనిని వదిలి వెళ్ళిపోయింది. దీంతో తీవ్రమైన మనస్థాపానికి గురై, ఒంటరితనం భరించలేక శనివారం మొండికుంట శివారులో గల ఓ చెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బాబాయి సున్నం సతీష్ ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పశువులతో వెళుతున్న కంటైనర్ పట్టుకున్న సీఐ అశోక్ రెడ్డి



**అశ్వాపురం, విశాలభారతి :** మహేంద్ర కంటైనర్ లో అక్రమంగా తరలిస్తున్న పశువులను అశ్వాపురం సిఐ. జి అశోక్ రెడ్డి పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు నుండి హైదరాబాదుకు తరలిస్తున్న కంటైనర్ను అశ్వాపురం టిడిపి సెంటర్లో ఆపి పోలీసులు తనిఖీ చేశారు. దీంతో ఆ కంటైనర్ లో 12 పశువులను ఒకదానిపై ఒకటి కట్టేసి ఉంచడాన్నీ గమనించిన సీఐ వెంటనే ఆ వాహనాన్ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు. అనంతరం చేపట్టిన విచారణలో హైదరాబాద్ కు చెందిన అజ్మత్, మహమ్మద్ అక్బర్ తోపాటు కొత్తగూడెంకు చెందిన మహమ్మద్ మషాద్ అనే వ్యక్తులు ఈ పశువులను తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. పశువులు తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి స్వాధీన పరుచుకున్న పశువులను పాల్వంచ గోశాలకు తరలించి నట్లు సీఐ తెలిపారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా



**బూర్గంపాడు, విశాలభారతి:** బూర్గంపాడు మండలం సారపాక లో నివాసి వంటి దేవులపల్లి సాయికిరణ్ శర్మ పరశురాం పరివార్ హిందూ సంస్థ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షునిగా కొనసాగించానని , సంస్థలో ఉన్న నాకు మంచి పేరు ప్రఖ్యాతలు కూడా రావడం జరిగింది అని, సంస్థ తరఫున అనేక కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేసాము అని, కానీ ఇటీవల కాలంలో కొన్ని అనవార్య కారణాలు అనగా నా వ్యక్తిగత కారణాల నిమిత్తం నేను ఈ పదవికి రాజీనామా చేస్తున్నాను. ఈ నా రాజీనామా పత్రాన్ని పరుశురాం పరివార్ హిందూ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్ కు అందజేయగా వారు నా రాజీనామా పత్రాన్ని అంగీకరించాటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాను.

# సీతమ్మ సాగర్ ఇనుపయార్డుపై దొంగల కన్ను

### రాజీవ్ సాగర్ ప్రాజెక్టు కోసం నిల్వ ఉంచిన ఇనుము కూడా మాయం
### రాజీవ్ సాగర్ ఇనుమును భారీగా అమ్ముకున్న వైనం
### సీతమ్మ సాగర్ మూసివేయడంతో దొంగల చేతివాటం
### సమగ్ర విచారణ చేపడితే మరి కొందరు దొంగలు దొరికే అవకాశం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు అశ్వాపురం మండల పరిధిలోని అమ్మగారిపల్లి సమీపం లోని గోదావరి నదిపై నిర్మించేందుకు తలపెట్టిన రాజీవ్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆనాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రాజెక్టు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కోట్లాది రూపాయల విలువ చేసే ఇనుప రాడ్లను ఆన కట్ట సమీప ప్రాంతంలో నిలువ చేశాడు. అనంతరం జరిగిన పరిణామాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణగా విభజన కావడం ప్రాజెక్టు నిర్మాణం లో మార్పులు జరగడం కారణంగా రాజీవ్ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిగా నిలిచిపోయింది. ఇక ఆ కాంట్రాక్టర్ కూడా ఇక్కడ నిల్వచేసిన ఇనప రాడ్ల యార్డుపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించకపోవడంతో ఈ రాడ్లతోనే అమ్మగారి పల్లి, అమీర్ధ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ రాడ్లను దొంగిలించడం ద్వారా అదే వృత్తిగా ఎంచుకున్నారని తెలుస్తోంది. అప్పటినుండి ఈ గోదావరిపై సీతారామ, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టి సీతారామసాగర్ పనులను పూర్తి చేసుకుంది. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పనులు నడుస్తున్న తరుణంలోనే ఎన్నికలు రావడం రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. అప్పుడు పనులు దక్కించుకున్న ఎల్ అండ్ టి సంస్థ సీతమ్మ సాగర్ నిర్మాణం కోసం అమ్మగారి పల్లి గోదావరి ఒడ్డున పెద్ద ఎత్తున ఇనుప నిక్షేపాలను నిల్వ చేసింది. వీటిని పర్యవేక్షించేందుకు ఓ సెక్యూరిటీ సంస్థకు కూడా బాధ్యతలు అప్పగించింది. అయితే ఎంత సెక్యూరిటీ ఉన్న అమ్మగారి పల్లి, అమేర్ధ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడ నిల్వ ఉంచిన ఇనుపరాడ్లను, ఇతర పనిముట్లను చాకచక్యంగా ట్రాక్టర్లలో లోడ్ చేసుకొని మణుగూరు, అశ్వాపురం పట్టణాలలో పాత ఇనుప కోట్లు నిర్వహణ చేపడుతున్న వారి కి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని పలువురు అంటున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం గోదావరి నది సమీపంలో ఎల్ అండ్ టి సంస్థ నిల్వచేసిన సుమారు రూ. 80వేల ఖరీదైన ఇనుపరాడ్లను అమ్మగారి పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్లో లోడ్ చేసుకొని విక్రయించేందుకు వెళుతుండగా స్వయాన ఆ సెక్యూరిటీ కి సంబంధించిన అధికారులే పట్టుకొని పోలీసులకు అప్పగించడం మండల ప్రజలకు తెలిసిన విషయమే. ఆ రాడ్లు దొంగిలించిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదు అయ్యింది.




**ప్రాజెక్టులు మూతపడటంతో లక్షలు కూడబెట్టుకున్న దొంగలు :**

రాజీవ్ సాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టులు మూతపడ్డ కారణంగా అమ్మగారిపల్లి, అమేర్ధ గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు ఇనుప రాడ్లు, ఇతర ఇనుప పరికరాలను దొంగిలించేందుకు లక్ష్యంగా పెట్టుకొని కొందరు వ్యక్తుల సహాయంతో అమ్మగారిపల్లి సమీప గోదావరి నది ఒడ్డున నిల్వ ఉంచిన ఇనుమును చోరీ చేస్తూ లక్షలాది రూపాయలను కూడగట్టుకున్నారని పలువురు అంటున్నారు. అక్రమ ఇనుము వ్యాపారం ద్వారా లక్షలు గడించి భూములు, బంగారపు ఆభరణాలు పెద్ద ఎత్తున కొనుగోలు చేసిన వ్యక్తులు ఉన్నారని పలువురు అంటున్నారు. కేవలం ప్రాజెక్టుల నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ఈ ప్రాజెక్టు కోసం యార్డులలో నిల్వ ఉంచిన ఇనుప సామాగ్రి పెద్ద ఎత్తున దొంగల పాలైందని ప్రజలంటున్నారు. నిజానికి మరి కొందరు దొంగలు తప్పించుకున్నారని, దొరికిన వాడే దొంగ దొరకని వారు రాజులుగా చలామణి అవుతున్నారని సీతమ్మసాగర్ ప్రాజెక్టు పరిసర పంచాయతీల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలవారు ఇక్కడ జరిగిన ఇనుప నిక్షేపాల చోరీపై ప్రత్యేక దృష్టి సారించి విచారణ చేపడితే మరికొందరు దొంగలు పట్టు పడడంతో పాటు మరెన్నో ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూసే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు.

## రాష్ట్ర స్థాయి సీఎం కప్ అథ్లెటిక్స్ పోటీలకు బాటసింగారం విద్యార్థి ఎంపిక

**ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

బాటసింగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రెండవ సీఎం కప్ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు హనుమకొండ జిల్లాలోని జవహర్ లాల్ నెహ్రూ అథ్లెటిక్స్ ప్రధాన మైదానంలో నిర్వహించనున్న రెండవ సీఎం కప్ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మండారి ధనంజనేయులు పాల్గొననున్నారు. ఆయన 14 సంవత్సరాల లోపు బాలుర విభాగంలో కిడ్స్ జావెలిన్ ఈవెంట్ లో తన ప్రతిభను ప్రదర్శించనున్నారు. గ్రామస్థాయి, మండలస్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిలలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ధనంజనేయులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించడం పాఠశాలకే కాక గ్రామానికి గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల మండల మరియు జిల్లా అధికారులు, జిల్లా కలెక్టర్, జిల్లా డీఈవో, ఎంపిడిఓ శ్రీవాణి, మండల ఎంఈఓ జగదీశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామస్తులు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, తల్లిదండ్రులు ధనంజనేయులను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## శివాజీ మహారాజ్ స్ఫూర్తితో మార్మోగిన మాధవీ నగర్

**ముఖ్య అతిథిగా శోభాయాత్రలో కంచి మహేందర్ సందేశం**




**కూకట్పల్లి విశాలభారతి:** స్వరాజ్య స్థాపకుడు,అపార ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మాధవీ నగర్‌లో యువత ఉత్సాహం నడుమ అట్టహాసంగా శోభాయాత్ర నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు కంచి మహేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని యువతకు స్ఫూర్తిదాయక సందేశం అందించారు.ఈ సందర్భంగా కంచి మహేందర్ మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ జీవితం దేశభక్తి, ధర్మరక్షణ, స్వాభిమానం మరియు పరిపాలనా నైపుణ్యాలకు చిరస్మరణీయ నిదర్శనమని పేర్కొన్నారు. యువత, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. శివాజీ మహారాజ్ చూపిన స్వరాజ్య మార్గం నేటి తరానికి కూడా దిశానిర్దేశం చేస్తుందని ఆయన అన్నారు. శోభాయాత్రలో యువత భారీ సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాన్ని అసోసియేషన్ సభ్యులు రాజు, కిరణ్, నరేష్, మణికంఠ ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో దేశభక్తి, ఐక్యత మరియు సామాజిక బాధ్యతపై చైతన్యం పెంపొందిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. మాధవీ నగర్‌లో జరిగిన ఈ శోభాయాత్ర విశేష స్పందనను రాబట్టింది.

## రానున్న రోజుల్లో సమాధానం చెప్పక తప్పదు

- **మండల బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు**

**మణుగూరు, విశాలభారతి:** ఈ మధ్యకాలంలో వచ్చినటువంటి కొంతమంది ప్రజాప్రతినిధులు అత్యుత్సాహంతో గ్రామపంచాయతీ కార్యదర్శులను ఉపయోగించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావు ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. మండలంలో గాని మున్సిపాలిటీలో గాని చాలామంది రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు కూడా ఉన్నాయి మరి ఆ ఫ్లెక్సీలకు లేనటువంటి ఆంక్షలు ఒక బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు కి కొత్తగా రూల్స్ పెట్టారా అని మణుగూరు మండల పార్టీ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు టౌన్ పార్టీ అధ్యక్షులు కుంట లక్ష్మణ్ మండిపడ్డారు. శనివారం నాడు మణుగూరు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి పార్టీ కి స్వేచ్ఛగా హక్కులను వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయన్నారు, కానీ కొత్తగా ఈ ఒక్క మణుగూరు లోనే కొత్త విష సంస్కృతిని కొంతమంది కావాలని దుర్బుద్ధితో అధికారాలను వినియోగించి పెత్తనం చాలా ఇస్తున్నారన్నారు. గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరుని కూడా ఉద్దేశం పూర్వకంగా ఇబ్బందులకు గురిచేసిన దాఖలాలు లేవన్నారు. ఇంకా రెండున్నర మూడు సంవత్సరాల తర్వాత మరలా టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుంది ఇప్పుడు ఎవరెవరైతే ఇలాంటి కార్యక్రమాలు చేస్తా ఉన్నారు వారికి పగలే చుక్కలు కనపడతాయి అన్నారు. ఏదో కొద్ది రోజులు పదవిలో ఉండి దిగిపోయే అటువంటి వారి మాటలు పట్టుకుని అధికారులు కూడా అడ్డగోలుగా ప్రవర్తిస్తే రానున్న రోజుల్లో సమాధానం చెప్పక తప్పదు అన్నారు. మరల ఇలాంటి కార్యక్రమాలు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే మా ధ్యేయం

- **సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్**
- **నూతన గేట్ వాల్ ను ఏర్పాటు చేసిన సర్పంచ్ పోలేబోయిన సుజాత**



**విశాలభారతి , కరకగూడెం:** మండలం కరకగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్ వద్ద మాజీ సర్పంచ్ గారి ఇంటి సమీపంలో నూతన గేట్ వాల్ ను ఏర్పాటు చేసిన సర్పంచ్ పోలేబోయిన సుజాత.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పాల్గొని మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా,మన అభిమాన నాయకులు గౌరవ ఎమ్మెల్యే శ్రీ.పాయం వెంకటేశ్వర్లు నాయకత్వంలో గ్రామాభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చూడటంతో పాటు, గ్రామంలోని ఇతర మౌలిక వసతుల సమస్యలను కూడా సర్పంచ్ పోలేబోయిన సుజాత ఆధ్వర్యంలో దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రారంభం



**మణుగూరు, విశాలభారతి :** మణుగూరు లోని గుట్ట మల్లారం ప్రాంతంలో స్థానిక యువత కోసం ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ఇటీవల ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిఐ నాగబాబు ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. సిఐ నాగబాబు, ఎస్సై నగేష్ కుమార్ సమక్షంలో ఈ శిక్షణా కేంద్రం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కేంద్రం ద్వారా యువతకు ఉచితంగా కంప్యూటర్ విద్యను అందించడం, వారిలో డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించడం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం ద్వారా ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడమే ఈ శిక్షణా కేంద్రం ముఖ్య ఉద్దేశ్యమని వారు పేర్కొన్నారు. కంప్యూటర్ శిక్షణ భవిష్యత్తుకు ఎంతో అవసరమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, యువత అధిక సంఖ్యలో హాజరయ్యారు. శిక్షణా కేంద్రం ద్వారా అనేక మంది ప్రయోజనం పొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చొరవను పలువురు అభినందించారు.

## ఏజెన్సీలో గోవుల అక్రమ రవాణా..!

- **అర్ధరాత్రి వాహనాల్లో హైదరాబాద్ కబేళాలకు తరలింపు**
- **సర్పంచ్ అనుమతి పత్రాలపై అనుమానాలు**
- **అధికారుల మౌనం చర్చనీయాంశం.**



**మణుగూరు, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. కరకగూడెం, పినపాక, మణుగూరు, అశ్వాపురం, కొత్తగూడెం ప్రధాన రహదారుల మార్గంగా అర్ధరాత్రి వేళల్లో డీసీఎం, బొలేరో వంటి వాహనాల్లో గోవులను హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల కళ్లుగప్పి ఈ తరలింపు జరుగుతోందా..? లేక అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతోందా..? అన్నది స్పష్టత లేకుండా ఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై జిల్లాలో వివిధ వర్గాల నుంచి ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

**అనుమతి పత్రాలపై అనుమానాలు**

గోవుల తరలింపులో గ్రామ సర్పంచ్‌ల అనుమతి పత్రాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. అయితే ఇవి నిజమైన అనుమతులా..? లేక నకిలీ పత్రాలా..? అన్నదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు వ్యక్తులు గోవులను పెంపకం కోసం తీసుకెళ్తున్నామని చెప్పి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి, అనంతరం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో గోవులను వాహనాల్లో తాడులతో కట్టి తరలించడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. గోవుల తరలింపు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. అనుమతి పత్రాల ఆధారంగా వాహనాలను అనుమతిస్తున్నారా..? లేక సరైన తనిఖీలు లేకుండా వదిలేస్తున్నారా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ వ్యవహారంలో కొందరు ప్రజాప్రతినిధులు, మధ్యవర్తుల ప్రమేయం ఉన్నట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. చర్యలు తీసుకోవాలని డిమాండ్ ఈ అంశంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అక్రమ రవాణా ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు, పలు హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా గోవులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గోవుల తరలింపు చట్టబద్ధమైతే స్పష్టత ఇవ్వాలని, అక్రమమైతే వెంటనే అరికట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మరో షూట్.. దేనికోసమంటే..?

టాలీవుడ్ స్టార్ జోడీ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి వార్త ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఈ జంట ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో వైభవంగా వివాహం చేసుకోబోతున్నట్లు తెలుస్తోంది. అయితే, పెళ్లికి ముందే ఈ జంట ఒక ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను పూర్తి చేసే పనిలో ఉంది. తాజా సమాచారం ప్రకారం, విజయ్ మరియు రష్మిక కలిసి ఒక కొత్త యాడ్ షూట్‌లో నటించబోతున్నారు. గతంలో వీరు కలిసి ఒక సోప్ యాడ్‌లో కనిపించి మెప్పించిన సంగతి తెలిసిందే.ఈ కొత్త యాడ్‌కు సంబంధించిన వివరాలను ప్రస్తుతానికి రహస్యంగా ఉంచినప్పటికీ, పెళ్లి వేడుకలకు ఆటంకం కలగకుండా ఈ షూటింగ్‌ను చాలా వేగంగా పూర్తి చేయాలని వారు ప్లాన్ చేస్తున్నారట. ఇక ప్రొఫెషనల్ విషయానికొస్తే, ఈ రీల్ అండ్ రియల్ లైఫ్ కపుల్ త్వరలో 'రణబాలి' అనే పీరియడ్ యాక్షన్ డ్రామాలో కలిసి నటించబోతున్నారు. 'టాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. చాలా కాలంగా వీరిద్దరి రిలేషన్‌షిప్ గురించి రకరకాల వార్తలు వస్తున్నప్పటికీ, ఈ పెళ్లి వార్తతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఉదయపూర్‌లో కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య ఈ వేడుక జరగనుందని, అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో సినీ ప్రముఖుల కోసం ఘనంగా రిసెప్షన్ నిర్వహించనున్నారని సమాచారం.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.